సాక్షి
ఖమ్మం
ఆదివారం । 5 । మే । 2024



బీజేపీ మళ్లీ గెలిస్తే ప్రమాదం

దేశంలో బీజేపీ మరోమారు గెలిస్తే రాజ్యాంగానికి ప్రమాదమని మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల వెల్లడించారు. IIలో



హామీల అమలులో విఫలం

అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన హామీల అమలులో కాంగ్రెస్ విఫలమైందని బీఆర్ఎస్ అభ్యర్థి నామ నాగేశ్వరరావు విమర్శించారు. IIలో

గరిష్టం / కనిష్టం
43° / 28°

వాతావరణం

జిల్లాలో వాతావరణం ఆదివారం ఉదయం కాస్త చల్లగా ఉంటుంది. ఆతర్వాత ఎండ మొదలై మధ్యాహ్నానికి పెరుగుతుంది.

దేశంలోనే అత్యధిక మెజారిటీ..



అభివాదం చేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి, పక్కన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, అభ్యర్థి రఘురాంరెడ్డి, ఎమ్మెల్యేలు కూనంనేని, రాందాస్‌నాయక్

- ఆనాటి 'రావి' చరిత్రను రఘురాంరెడ్డి తిరగరాస్తారు
- ఖమ్మంలో కాంగ్రెస్‌కు మూడు లక్షల ఓట్ల మెజారిటీ ఖాయం
- కల్వకుంట్ల ప్రమాదాన్ని ముందుగా పసిగట్టింది ఖమ్మమే
- భద్రాద్రి రాముడి సాక్షిగా రుణమాఫీ చేసి తీరుతాం
- కొత్తగూడెం జనజాతర సభలో సీఎం రేవంత్‌రెడ్డి



కేంద్రం గాడిదగుడ్డు ఇచ్చిందని చెబుతున్న సీఎం రేవంత్‌రెడ్డి, పక్కన ఖమ్మం, మహబూబాబాద్ అభ్యర్థులు రఘురాంరెడ్డి, బలరాంనాయక్

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: ఈ లోక్‌సభ ఎన్నికల్లో యావత్ దేశంలోనే ఖమ్మం కాంగ్రెస్ అభ్యర్థి రామసహాయం రఘురాంరెడ్డి అత్యధిక మెజారిటీ సాధిస్తారని ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి వెల్లడించారు. కొత్తగూడెంలోని ప్రకాశం స్టేడియంలో శనివారం నిర్వహించిన జనజాతర సభలో ఆయన ప్రసంగించారు. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత జరిగిన ఎన్నికల్లో ఎంపీగా పోటీ చేసిన రావి నారాయణరెడ్డికి జవహర్‌లాల్ నెహ్రూ కంటే ఎక్కువ మెజార్టీ వచ్చిందని, ఇప్పుడు మళ్లీ ఖమ్మం నుంచి పోటీ చేస్తున్న రఘురాంరెడ్డికి మూడు లక్షల మెజారిటీ రాబోతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కేంద్ర మంత్రివర్గంలో చోటు అంటూ కేసీఆర్ చెప్పే మాటలను నమ్మొద్దని బీఆర్ఎస్ అభ్యర్థి నామకు సీఎం సూచించారు. కాంగ్రెస్ సంకీర్ణ ప్రభుత్వంలో బీఆర్ఎస్‌కు చోటు లేదని స్పష్టం చేశారు.

కేసీఆర్‌ను నమ్మలేదు

గొప్ప చరిత్ర కలిగిన ఖమ్మం చైతన్యవంతమైనదని.. రైతుల హక్కుల సాధనకు ఘనమైన పోరాటాలు చేసిందని సీఎం తెలిపారు. అందుకే బీఆర్ఎస్ కపట నాటకాలను ఇక్కడి ప్రజలు నమ్మలేదని చెప్పారు. ఫలితంగా 2014, 2018, 2023 ఎన్నికల్లో కాలకూట విషం దాచుకున్న కేసీఆర్ పార్టీని వంద అడుగుల గొయ్యి తీసి పాతిపెట్టారని వెల్లడించారు. కేసీఆర్‌తో రాబోయే ప్రమాదాన్ని ముందుగానే ఖమ్మం ప్రజలు గుర్తించారని కితాబిచ్చారు. తొలిదశ తెలంగాణ ఉద్యమం మొదలైందే కొత్తగూడెం నుంచి అని గుర్తు చేశారు. ఎవరితో పెట్టుకున్నా.. ఖమ్మం జిల్లా ప్రజలతో మాత్రం పెట్టుకోకు కేసీఆర్ అంటూ.. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హెచ్చరించారు.

భద్రాద్రి రాముడి సాక్షిగా చెబుతున్నా

రైతు భరోసా పథకం ద్వారా ఏడున్నర లక్షల మంది రైతులకు లబ్ధి కలిగిందని, మిగతా నాలుగు లక్షల మంది రైతులకు త్వరలోనే రైతు భరోసా ఇస్తామని సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వం రూ.వేల కోట్ల అప్పులు చేసిందని, వీటికి నెలకు రూ.27 వేల కోట్ల వడ్డీ కడుతూనే.. వివిధ పథకాలను అమలు చేస్తున్నామని, ఉద్యోగులకు సకాలంలో వేతనాలు చెల్లిస్తున్నామని తెలిపారు. ఈనెల 8వ తేదీలోపు మిగిలిన రైతులకు రైతు భరోసా సాయం అందజేస్తామని ప్రకటించారు. అప్పుడు అమరవీరుల స్థూపం సాక్షిగా ముక్కు నేలకు రాస్తావా.. అంటూ కేసీఆర్‌కు సవాల్ విసిరారు. ఇక భద్రాచలం రాముడి సాక్షిగా పంద్రాగస్టు నాటికి రుణమాఫీ అమలు చేసి తీరుతామని వెల్లడించారు.

ఆ రోజుల్లోనే వైఎస్సార్ చెప్పారు..

'ఈ రాష్ట్రానికి నేను ముఖ్యమంత్రినైనా.. అది 22 జిల్లాలకే పరిమితం. ఖమ్మం జిల్లాకు మాత్రం అక్కడ ఉన్న కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలే ముఖ్యమంత్రులు' అని ఆ రోజుల్లోనే దివంగత సీఎం రాజశేఖర్‌రెడ్డి చెప్పేవారని రేవంత్‌రెడ్డి తెలిపారు. కాంగ్రెస్‌లో తాను చేరిన కొత్తలో ఢిల్లీలో అహ్మద్ పటేల్‌ను కలిసినప్పుడు ఆయన ఈ విషయం తనకు చెప్పారని సీఎం గుర్తు చేసుకున్నారు.

ఇంకా ఈ సభలో కొత్తగూడెం, పినపాక, భద్రాచలం, అశ్వారావుపేట, సత్తుపల్లి, వైరా ఎమ్మెల్యేలు కూనంనేని సాంబశివరావు, పాయం వెంకటేశ్వర్లు, తెల్లం వెంకట్రావు, జారే ఆదినారాయణ, డాక్టర్ మట్టా రాగమయి, రాందాస్ నాయక్ మాట్లాడగా జెడ్పీ చైర్మన్ కంచర్ల చంద్రశేఖర్‌రావు, కాంగ్రెస్, సీపీఎం, సీపీఐ నాయకులు పోతినేని సుదర్శన్‌రావు, పిడమర్తి రవి, వక్కలగడ్డ సోమచంద్రశేఖర్, నాగ సీతారాములు తదితరులు పాల్గొన్నారు.

సోనియమ్మకు రుణపడి ఉంటా

ఖమ్మం టికెట్ తనకు కేటాయించిన కాంగ్రెస్ అధినేత్రి సోనియాగాంధీకి ఎప్పటికీ రుణపడి ఉంటా. కేవలం 150 రోజుల్లోనే ఆరు గ్యారంటీల్లో ఐదు అమలు చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిది. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం వచ్చాక రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని చెప్పి.. ఉన్నవాటిలో కోటి ఉద్యోగాలు తొలగించారు. రాముడి పేరు చెప్పి మత రాజకీయాలు చేస్తున్నారు. మతాల చిచ్చు మనకొద్దు. భారీ మెజారిటీతో ప్రజలు నన్ను గెలిపిస్తే అహర్నిశలు అభివృద్ధికి పాటుపడతా.

– రఘురాంరెడ్డి, కాంగ్రెస్ అభ్యర్థి



కొత్తగూడెం జనజాతర సభకు హాజరైన జనం

సాక్షి తెలంగాణ ఎలక్షన్ 2024

సింగరేణిని కాపాడుకుంటాం



కేసీఆర్ పాలనలో సింగరేణిని నిర్వీర్యం చేస్తే తమ ప్రభుత్వం సంస్థను కాపాడుతోంది. దేశంలో ఎక్కడా లేనివిధంగా సింగరేణి కార్మికుల కోసం రూ. కోటి బీమా పాలసీ తీసుకొచ్చాం. మూసేసిన థర్మల్ పవర్ స్టేషన్‌ను తిరిగి వాడకంలోకి తీసుకొచ్చి వెలుగులు నింపుతాం. ఎక్కడా కరెంటు కోత లేకుండా సరఫరా చేస్తున్నాం. ఈ విషయంలో విపక్షాలు తప్పుడు ప్రచారం ఆపాలి. కేంద్రంలో బీజేపీ వస్తే రిజర్వేషన్లు ఎత్తి వేయనున్నందున వాటి రక్షణకు అంతటా కాంగ్రెస్‌ను గెలిపించాలి. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి ఆర్థిక క్రమశిక్షణ కనిపిస్తోంది. ఖమ్మం ఎంపీగా రఘురాంరెడ్డిని గెలిపించి రాహుల్‌గాంధీని ప్రధాని చేయడంలో మన జిల్లా పాత్ర ఉండాలి.

– మల్లు భట్టి విక్రమార్క, ఉప ముఖ్యమంత్రి

ప్రజల ఓట్లే గీటురాయి



రాష్ట్ర పాలన ఎంత బాగుందో చెప్పడానికి లోక్‌సభ ఎన్నికలే రెఫరెండం.. ప్రజల ఓట్లే గీటురాయి. ఆంధ్రాలో కలిసిన ఐదు పంచాయతీలను తిరిగి మనం తెచ్చుకోవాలంటే కాంగ్రెస్ గెలవాలి. పంట నష్టపోయిన రైతులకు కొద్దిరోజుల్లో పరిహారం ఇస్తాం. జిల్లాను సస్యశ్యామలం చేసేందుకు కృషి జరుగుతోంది.

– తుమ్మల నాగేశ్వరరావు, మంత్రి

బీఆర్ఎస్, బీజేపీవి తెర వెనుక డ్రామాలు



బీజేపీకి బీ టీం గా బీఆర్ఎస్ వ్యవహరిస్తోంది. ఖమ్మంలో నామను గెలిపిస్తే కేంద్ర మంత్రి అవుతాడని కేసీఆర్ చెప్పిన మాటను బట్టి.. తెరవెనుక వారి డ్రామా బయట పడింది. అప్పుడు సంక్షేమం మరిచి, ఇప్పుడు కర్ర పట్టుకుని జిల్లాకు వచ్చిన కేసీఆర్ అబద్ధాలు చెబుతూ ఓట్లు అడుగుతున్నారు.

– పొంగులేటి శ్రీనివాసరెడ్డి, మంత్రి

కలిసి పనిచేస్తాం..



రాజ్యసభలో నేను, లోక్‌సభలో రఘురాంరెడ్డి, ముఖ్యమంత్రిగా రేవంత్‌రెడ్డి ఉంటే రాష్ట్రానికి వచ్చే నిధులను ఎవరూ ఆపలేరు. ఎన్నికల తర్వాత రఘురాంరెడ్డికి వచ్చే మెజారిటీ చూసి గల్లీల్లో ఉన్న బీఆర్ఎస్ నాయకుల గుండెలు అదరాలి.

– రేణుకాచౌదరి, ఎంపీ

అన్నిధరలూ పెరిగాయి..



బీజేపీ కార్పొరేట్లకు దోచి పెడుతోంది. గ్యాస్, విద్యుత్ ఇలా అన్నింటి ధరలూ పెంచారు. ఎరువుల ధరలనూ పెంచడంతో రైతులు వ్యవసాయం చేయలేని పరిస్థితి ఎదురవుతోంది. దేశంలో నిరుద్యోగం రెండు నుంచి ఎనిమిది శాతానికి పెరిగింది.

– ప్రొఫెసర్ కోదండరాం

న్యూస్‌రీల్

జమలాపురం ఆలయంలో ప్రత్యేక పూజలు



ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

ఎర్రుపాలెం: తెలంగాణ తిరుపతిగా పేరున్న జమలాపురంలోని శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో అర్చకులు శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలోని శ్రీవారి పాదంతో పాటు స్వామి మూల విరాట్‌కు పంచామృతాలతో అభిషేకం చేశారు. అలాగే, స్వామి, అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించి నిత్యకల్యాణం, పల్లకీ సేవ జరపగా తెలంగాణ, ఏపీలోని వివిధ ప్రాంతాల భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. ఈఓ జగన్మోహన్‌రావు, చైర్మన్ శ్రీరామచంద్రమూర్తి, సూపరింటెండెంట్ విజయకుమారి, అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రమాదరహిత జిల్లాగా తీర్చిదిద్దాలి



సిబ్బందికి రక్షణ పరికరాలు అందిస్తున్న ఎస్ఈ, అధికారులు

ఖమ్మంవ్యవసాయం: విద్యుత్ ఉద్యోగులు విధినిర్వహణ సమయాన తగిన జాగ్రత్తలు పాటించాలని ఖమ్మం ఎస్ఈ ఏ.సురేందర్ సూచించారు. విద్యుత్ భద్రతా వారోత్సవాల్లో భాగంగా శనివారం ఖమ్మంలో ఖమ్మం రూరల్ డివిజన్ ఉద్యోగులు, సిబ్బంది సమావేశం నిర్వహించారు. డీఈ సీహెచ్.నాగేశ్వరరావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఎస్ఈ మాట్లాడుతూ ఉద్యోగులు, సిబ్బంది విధి నిర్వహణలో తగిన జాగ్రత్తలు పాటిస్తూ ప్రమాదరహిత జిల్లాగా తీర్చిదిద్దాలని కోరారు. అనంతరం సిబ్బందికి రక్షణ పరికరాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో డీఈ బాబూరావు, ఏఈడీలు రామకృష్ణ, బీమ్‌సింగ్, కోక్యానాయక్ తదితరులు పాల్గొన్నారు.

మూడో రోజు నలుగురు నామినేషన్లు

నల్లగొండ: నల్లగొండ – ఖమ్మం – వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికకు శనివారం నలుగురు అభ్యర్థులు నామినేషన్లు సమర్పించారు. కర్నె రవి నేషనల్ నవక్రాంతి పార్టీ తరఫున, స్వతంత్ర అభ్యర్థిగా ఒక్కో సెట్ వేశారు. అలాగే, స్వతంత్రులుగా బైరబోతుల శ్రీనివాసరావు, ధైద సోమసుందరం, బక్క జడ్సన్ నామినేషన్ పత్రాలను అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి సీహెచ్.మహేందర్‌కు అందజేశారు.

ఓటు వేసిన 1,597 మంది

ఖమ్మం సహకారనగర్: ఖమ్మం లోక్‌సభ నియోజకవర్గ పరిధిలో హోం ఓటింగ్, పోస్టల్ బ్యాలెట్ ద్వారా ద్వారా శనివారం వరకు 1,597మంది ఓటు వేశారని రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ వీ.పీ.గౌతమ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో 85 ఏళ్ల పైబడిన వృద్ధులు, దివ్యాంగులతో పాటు అత్యవసర సేవలకు సంబంధించిన ఉద్యోగులు ఉన్నారని వెల్లడించారు.

వాతవరణంలో మార్పులు

- ఉరుములు, మెరుపులతో పలుచోట్ల వర్షం



ఖమ్మంవ్యవసాయం: వాతావరణంలో ఒక్కసారిగా మార్పు వచ్చింది. శనివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు గరిష్టస్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదు కాగా.. ఆతర్వాత జిల్లాలోని పలు చోట్ల పలుచోట్ల ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. ఖమ్మం నగరంలోనూ ఆకాశం మేఘావృతమైంది. సత్తుపల్లి, వైరా, మధిర వ్యవసాయ డివిజన్లలో పలుచోట్ల ఈదురుగాలులు, ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. ఈదురుగాలుల కారణంగా కోత దశలో ఉన్న మామిడి కాయలు నేల రాలినట్లు తెలుస్తోంది. గత నెలలో ఈదురుగాలులు, అకాల వర్షాలకు పలుచోట్ల కోత దశలో ఉన్న వరి, మొక్కజొన్న, మామిడి పంటలకు నష్టం వాటిల్లింది. ఇప్పుడు వరి, మొక్కజొన్న పంటల కోతలు పూర్తవుతున్న దశలో ఉండగా, మామిడి కోతలు సాగుతున్నాయి. ఈనేపథ్యాన అక్కడక్కడా మామిడి పంటకు నష్టం జరిగిందని సమాచారం. అయితే, చిరుజల్లులు మొదలు ఓ మోస్తరు వర్షం కురవడంతో వాతావరణం చల్లబడగా ప్రజలకు తాత్కాలికంగా ఉపశమనం లభించినట్లయింది. కాగా, శనివారం జిల్లా వ్యాప్తంగా 40 నుంచి 45 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదైనట్లు వాతావరణ శాఖ ప్రకటించగా.. అత్యధికంగా చింతకానిలో 44.7 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది.

ఈవీఎంల ర్యాండమైజేషన్ పూర్తి



ఈవీఎంలను తరలింపును పరిశీలిస్తున్న కలెక్టర్ గౌతమ్

ఖమ్మం సహకారనగర్: ఖమ్మం లోక్‌సభ నియోజకవర్గ పరిధిలో పోలింగ్ కేంద్రాల వారీగా ఈవీఎంల కేటాయింపు పూర్తయిందని ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ వీ.పీ.గౌతమ్ అన్నారు. కలెక్టరేట్‌లో శనివారం ఆయన ఎన్నికల పరిశీలకుడు డాక్టర్ సంజయ్ జి.కోల్టేతో కలిసి ర్యాండమైజేషన్‌ను పరిశీలించి మాట్లాడారు. ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో కేటాయించిన ఈవీఎంల వివరాలను రాజకీయ పార్టీల ప్రతినిధులకు అందజేశామని తెలిపారు. ఆతర్వాత నియోజకవర్గాల వారీగా అదనంగా అవసరమైన ఈవీఎంలను స్ట్రాంగ్ రూంలకు తరలించారు. కలెక్టరేట్ ఆవరణలోని ఈవీఎం గోదాం నుండి అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా స్ట్రాంగ్‌రూమ్‌లకు ఈవీఎంలను తరలించగా కలెక్టర్ పరిశీలించారు. అదనపు కలెక్టర్ డి.మధుసూదన్‌నాయక్, కేఎంసీ కమిషనర్ ఆదర్శ్ సురభి, డీఆర్వో రాజేశ్వరి, ఉద్యోగి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్‌లో జాగ్రత్త

ఖమ్మంరూరల్: పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్‌ను జాగ్రత్తగా నిర్వహించాలని కలెక్టర్ వీ.పీ.గౌతమ్ సూచించారు. ఖమ్మం రూరల్ తహసీల్‌లో పోస్టల్ బ్యాలెట్ ఫెసిలిటేషన్ సెంటర్‌ను శనివారం ఆయన పరిశీలించి ఉద్యోగులకు సూచనలు చేశారు. ఓటింగ్ పారదర్శకంగా జరిగేలా చూడాలని, ప్రతీ అంశాన్ని జాగ్రత్తగా పరిశీలించాలని చెప్పారు. ఆతర్వాత కలెక్టర్ గౌతమ్, సీపీ సునీల్‌దత్ పొన్నేకల్‌లోని శ్రీ చైతన్య ఇంజనీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూంలు, ఓట్ల లెక్కింపు కేంద్రాన్ని పరిశీలించి ఏర్పాట్లపై భద్రత, ఏర్పాట్లపై సూచనలు చేశారు. వివిధ శాఖల అధికారులు శ్యాంప్రసాద్, శ్రీలత, రామకృష్ణ పాల్గొన్నారు.

నాకు ఓటు వేస్తే మోదీకి వేసినట్టే..

- రామరాజ్యం తీసుకొచ్చిన మోదీని మళ్లీ గెలిపించాలి
- బీజేపీ అభ్యర్థి తాండ్ర వినోద్‌రావు

సత్తుపల్లి: దేశంలో మరోమారు బీజేపీ అధికారంలోకి రావడమే కాక ఖమ్మంలోనూ తన విజయం ఖాయమని పార్టీ లోక్‌సభ అభ్యర్థి తాండ్ర వినోద్‌రావు వెల్లడించారు. తనకు వేసే ప్రతీ ఓటు మోదీకి వేసినట్లేనని.. రామరాజ్యం తీసుకొచ్చిన బీజేపీని ప్రజలు మళ్లీ గెలిపించాలని కోరారు. సత్తుపల్లిలో శనివారం నిర్వహించిన కార్నర్ మీటింగ్‌లో బీజేపీ జిల్లా అధ్యక్షులు గల్లా సత్యనారాయణతో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా వినోద్‌రావు మాట్లాడుతూ తనను గెలిపిస్తే మాజీ ముఖ్యమంత్రి జలగం వెంగళరావు మాదిరి జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి చూపిస్తానని వెల్లడించారు. గోదావరి జలాలను అందిస్తానని, ఇన్నాళ్లు కాంగ్రెస్, బీఆర్ఎస్ విస్మరించిన పామాయిల్ బోర్డు సైతం సాధిస్తానని తెలిపారు. కాగా, తాము ఎస్సీ, ఎస్టీ, బీసీ రిజర్వేషన్లు ఎత్తివేస్తామని తప్పుడు ప్రచారం చేస్తున్న బీఆర్ఎస్, కాంగ్రెస్ నేతల మాటలు నమ్మొద్దని ఆయన కోరారు. ఈసందర్భంగా వివిధ పార్టీల నాయకులు పలువురు బీజేపీలో చేరారు.



సత్తుపల్లిలో మాట్లాడుతున్న బీజేపీ అభ్యర్థి తాండ్ర వినోద్‌రావు

బీజేపీకి అవకాశం ఇవ్వండి

మధిర: ఖమ్మంలో ఇన్నాళ్లు కాంగ్రెస్, బీఆర్ఎస్‌కు అవకాశం ఇచ్చిన ప్రజలు ఈసారి బీజేపీ అవకాశం ఇవ్వాలని ఆ పార్టీ అభ్యర్థి తాండ్ర వినోద్‌రావు కోరారు. మధిరలో శనివారం కమల దళ శంఖారావం పేరిట నిర్వహించిన సభలో ఆయన మాట్లాడారు. ఖమ్మం ప్రజలు ఏం పాపం చేశారని గత ఎంపీలు అభివృద్ధి చేయలేదో చెప్పాలన్నారు. ప్రధాని నరేంద్ర మోడీ అన్ని రాష్ట్రాల్లో అడిగిన వారికి అడిగినంత నిధులు కేటాయిస్తే ఖమ్మం ఎంపీలు మాత్రం అడగలేకపోయారని విమర్శించారు. తనను గెలిపిస్తే నిధులు సాధిస్తానని తెలిపారు. కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండపల్లి శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ 400 సీట్లతో మోడీ ప్రభుత్వం ఏర్పడనున్నందున ఖమ్మం నుంచి వినోద్‌రావును గెలిపించాలని కోరారు. కాగా, మధిర ఎమ్మెల్యేగా నాలుగు సార్లు గెలిచిన భట్టి ఏం చేశారో చెప్పాలని సూచించారు. అనంతరం పార్టీ జిల్లా అధ్యక్షుడు గల్లా సత్యనారాయణ మాట్లాడుతూ ఇటీవల బోనకల్‌లో గొర్రెల రుణాలకు సంబంధించి సమస్య వస్తే వినోద్‌రావు అధికారులతో మాట్లాడి పరిష్కరించారని తెలిపారు. అనంతరం టీడీపీకి చెందిన వార్డు కౌన్సిలర్ పగిడిపల్లి విజయమ్మ, ఆమె మద్దతుదారులు బీజేపీలో చేరారు. ఈసమావేశాల్లో మాజీ మంత్రి విజయరామారావు, నాయకులు నంబూరి రామలింగేశ్వరరావు, ఏలూరి నాగేశ్వరావు, కొండేటి శ్రీధర్, వీరపనేని పద్మ, శ్రీకాంత్, భాస్కర్ల వీరంరాజు, సుదర్శన్ మిశ్రా, పాలకొల్లు శ్రీను, మట్టా ప్రసాద్, దొడ్డపనేని కృష్ణయ్య, వందనపు భాస్కర్‌రావు, తిరుపతిరెడ్డి, చల్లా తిరుమలాదేవి, విష్ణువర్ధన్‌రెడ్డి, పెరుమాళ్లపల్లి విజయ్‌రాజు, చిలువేరు సాంబశివరావు, వేణుగోపాల్ రెడ్డి, గుగులోత్ నాగేశ్వరావు, పాపట్ల రమేష్, గుండా చంద్రశేఖర్‌రెడ్డి, మర్శకట్ల స్వర్ణాకర్ తదితరులు పాల్గొన్నారు.

'నీట్'కు ఏర్పాట్లు పూర్తి

- నేడు ఉమ్మడి జిల్లాలోని ఏడు కేంద్రాల్లో పరీక్ష
- హాజరుకానున్న 4,434 మంది విద్యార్థులు
- 11నుంచి 1–30గంటల వరకే కేంద్రాల్లోకి అనుమతి



ఆర్.పార్వతీరెడ్డి, పరీక్షల ఖమ్మం జిల్లా కోఆర్డినేటర్

ఖమ్మం సహకారనగర్: దేశవ్యాప్తంగా 2024–25వ విద్యా సంవత్సరానికి వైద్య కళాశాలల్లో ప్రవేశానికి నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్‌టీఏ) నిర్వహించే నీట్(నేషనల్ ఎలిజిబిలిటీ ఎంట్రన్స్ టెస్టు)కు జిల్లాలో ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఆదివారం జరిగే ఈ పరీక్ష నిర్వహణకు ఉమ్మడి జిల్లాలో ఏడు కేంద్రాలు ఏర్పాటుచేశారు. ఖమ్మంలోని హార్వెస్ట్ పబ్లిక్ స్కూల్, ఎస్‌వీఎంసెంట్రల్ పబ్లిక్ స్కూల్, మ్యాక్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ సైన్సెస్, బ్లూమింగ్ మైండ్స్ సెంట్రల్ స్కూల్స్, రఘునాథపాలెం సమీపాన ఎస్ఈఎస్ వీ.వీ.సెంట్రల్ పబ్లిక్ స్కూల్‌తో పాటు కొత్తగూడెంలోని సింగరేణి డిగ్రీ, పీజీ కళాశాల, పాల్వంచలోని నవభారత్ పబ్లిక్ స్కూల్‌లో పరీక్ష జరగనుంది. ఈమేరకు ఖమ్మం జిల్లాలోని కేంద్రాల్లో 3,260 మంది, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని కేంద్రాల్లో 1,174మంది విద్యార్థులు హాజరుకానున్నారని నిర్వాహకులు తెలిపారు.

2గంటల నుంచి పరీక్ష

నిర్ణీత కేంద్రాల్లో నీట్ ఆదివారం మధ్యాహ్నం 2గంటల నుంచి 5–20గంటల వరకు జరుగుతుంది. అయితే, విద్యార్థులను మాత్రం ఉదయం 11నుంచి మధ్యాహ్నం 1–30గంటల వరకు కేంద్రాల్లోకి అనుమతిస్తారు. ప్రతీ విద్యార్థిని తనిఖీ చేయాల్సి ఉండడంతో ఈ నిర్ణయం తీసుకున్నారు. కాగా, 1.30గంటల తర్వాత వచ్చే వారికి అనుమతి ఉండదని పరీక్షల ఖమ్మం, కొత్తగూడెం కోఆర్డినేటర్లు ఆర్.పార్వతీరెడ్డి, ఎం.వీ.ఎస్ రెడ్డి వెల్లడించారు.

హాఫ్ హ్యాండ్ చొక్కా తప్పనిసరి

విద్యార్థులు ఎలాంటి ఎలక్ట్రానిక్ పరికరాలు తీసుకురావొద్దు. అలాగే, ఆభరణాలు కూడా ధరించి రావొద్దు. హాఫ్ హ్యాండ్స్ షర్ట్స్ మాత్రమే ధరించాలి. బూట్లు కాకుండా స్లిప్పర్లు మాత్రమే వేసుకునిరావాలి. కేంద్రాల్లో నిర్వాహకులే పెన్నులు ఇస్తారు. విద్యార్థులు వ్యక్తిగతంగా వాటర్ బాటిల్‌తో పాటు అడ్మిట్ కార్డు, పాస్‌పోర్టు సైజ్ కలర్ ఫొటోలు తీసుకురావాలి. అలాగే, డౌన్‌లోడ్ చేసుకున్న ప్రొఫార్మాపై ఒక ఫొటో అతికించుకుని పరీక్షకు హాజరుకావాల్సి ఉంటుంది. అలాగే, ప్రతీ విద్యార్థి ప్రభుత్వం జారీ చేసిన ఒరిజనల్ కార్డు వెంట తెచ్చుకోవాలి. పరీక్ష పూర్తయిన సాయంత్రం 5.20గంటల తర్వాత మాత్రమే బయటకు పంపిస్తారు.

క్లుప్తంగా

ఇవి దేశ భవితను నిర్ణయించే ఎన్నికలు..

విద్యావంతుల సమావేశంలో సుధాకర్



విద్యావంతులను ఓటు అభ్యర్థిస్తున్న బీజేపీ అభ్యర్థి వినోద్‌రావు

ఖమ్మం మామిళ్లగూడెం: ప్రస్తుతం జరుగుతున్న పార్లమెంట్ ఎన్నికలు రానున్న ముప్పై ఏళ్ల దేశ భవితను నిర్ణయిస్తాయని రాజకీయ విశ్లేషకులు, జర్నలిస్టు రాక సుధాకర్ తెలిపారు. ఖమ్మంలో శనివారం నిర్వహించిన విద్యావంతుల సమావేశంలో ఆయన మాట్లాడారు. భారత్, ఇండియాకు మధ్య జరుగుతున్న ఎన్నికల్లో ప్రతీ ఒక్కరు జాగ్రత్తగా ఆలోచించి సమర్థమైన, బలమైన నాయకత్వాన్ని ఎన్నుకోవాలని సూచించారు. బీజేపీని గెలిపిస్తే మోదీ నేతృత్వాన భారత్ విశ్వగురువుగా మారుతుందని తెలిపారు. అయోధ్యలో కరసేవకు రెండు వేల మందిని పంపిన ఖమ్మం ప్రజలు విజ్ఞతతో ఆలోచించి బీజేపీ అభ్యర్థి తాండ్ర వినోద్‌రావును గెలిపించాలని కోరారు. అనంతరం వినోద్‌రావు మాట్లాడుతూ గడిచిన పదేళ్లలో ఖమ్మం అనుకున్నంత అభివృద్ధి చెందలేదన్నారు. ఒకసారి తనకు అవకాశమిస్తే అన్ని రంగాల్లో అభివృద్ధికి పాటుపడతానని తెలిపా రు. ఈసమావేశంలో డాక్టర్ గోంగూర వెంకటేశ్వర్లు, డాక్టర్ శీలం పాపారావు, శెట్టిపల్లి నాగేశ్వరావు, కావ్యచంద్, మోతుకూరి నారాయణరావు, వెంపటి లక్ష్మీ నారాయణ, రాజేంద్రప్రసాద్, శ్రీనివాసరావు, దుర్గాప్రసాద్‌రెడ్డి, జైపాల్‌రెడ్డి, లలిత, శ్రీదేవి, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాన్ని కమ్మేసిన కేటీపీఎస్ బూడిద

పాల్వంచరూరల్: గాలి దుమారానికి కేటీపీఎస్ యాష్ పాండ్‌లో బూడిద లేచి స మీపంలోని సూరారం గ్రామాన్ని కమ్మేసింది. కేటీపీఎస్ కర్మాగారంలో విద్యుదుత్పత్తికోసం వినియోగించే బొగ్గును మండించాక బూడిదను పైపులైన్ ద్వారా చెరువులోకి పంపిస్తారు. ఇలా నిత్యం టన్నుల కొద్దీ బూడిద చెరువులోకి చేరుతుంది. కొద్దిరోజులకు తడి ఆరాక గాలికి లేచి సమీప గ్రామాలను కమ్ముకుంటుంది. శనివారం సాయంత్రం వచ్చిన గాలి దుమారానికి యాష్ పాండ్‌లోని బూడిద సూరారం గ్రామాన్ని కమ్మేయడంతో ప్రజలు ఉక్కిరి బిక్కిరి అయ్యారు. ప్రతి ఏటా వేసవి కాలంలో గాలిదుమారాలకు బూడిద కాలుష్యంతో ఇబ్బందులు పడుతున్నామని, కలుషిత గాలిని పీల్చి అనారోగ్యానికి గురవుతున్నారని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.14,229

ప్రశాంతంగా సీఎం టూర్

- ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా చర్యలు
- 500 మంది పోలీసులతో భారీ బందోబస్తు
- పర్యవేక్షించిన ఎస్పీ రోహిత్‌రాజ్



పోస్టాఫీస్ సెంటర్‌లో బందోబస్తును పర్యవేక్షిస్తున్న ఎస్పీ రోహిత్‌రాజ్

కొత్తగూడెంటౌన్: లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా కొత్తగూడెం సింగరేణి ప్రకాశం స్టేడియంలో శనివారం నిర్వహించిన సీఎం బహిరంగ సభ ప్రశాంతంగా ముగిసింది. సభకు ముఖ్యమంత్రి అనుముల రేవంత్‌రెడ్డి హాజరైన నేపథ్యంలో జిల్లా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకున్నారు. హెలిప్యాడ్ నుంచి కాన్వాయ్‌తో సభ స్థలికి వచ్చే వరకు, సభ అనంతరం వెళ్లేవరకు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు. డీఎస్పీలు, సీఐలు, ఎస్సైలు, కానిస్టేబుల్ సుమారు 500 మంది పోలీసులు పాల్గొనగా, ఎస్పీ రోహిత్ రాజు బందోబస్తును పర్యవేక్షించారు. బహిరంగ సభకు జిల్లా నలుమూలల నుంచి కాంగ్రెస్, సీపీఐ నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో తరలివచ్చారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పోలీసులు ట్రాఫిక్‌ను నియంత్రించారు. రామవరం బ్రిడ్జి వద్ద, హెడ్ ఆఫీస్ వద్ద, బస్టాండ్ వద్ద, రైటర్‌బస్తీ, పోస్టాఫీస్ ఏరియాల వద్ద బారికేడ్లు ఏర్పాటు చేసి ట్రాఫిక్ డైవర్షన్ చేశారు. పాల్వంచ వైపు నుంచి కొత్తగూడెం మీదుగా విజయవాడ వైపు వెళ్లె వాహనాలు ఓల్డ్ డిపో రోడ్డు నుంచి భజనమందిర్ రోడ్డు, సింగరేణి హెడ్ ఆఫీస్ మీదుగా రామవరం వైపు మళ్లించారు. పాల్వంచ నుంచి ఖమ్మం వెళ్లె వాహనాలు ఇల్లెందు క్రాస్ రోడ్డు నుంచి టేకులపల్లి, ఇల్లెందు మీదుగా ఖమ్మం మళ్లించారు. ఖమ్మం వైపు నుంచి వచ్చే వాహనాలను కొత్తగూడెంలోని విద్యానగర్ బైపాస్ రోడ్డు నుంచి సింగరేణి హెడ్ ఆఫీస్, మెయిన్ ఆస్పత్రి, భజనమందిర్ రోడ్డు, ఓల్డ్ డిపో రోడ్డు వైపు పంపారు. సామాన్య ప్రజలకు, వాహనదారులకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టారు. ఏఎస్పీ టి.సాయిమనోహర్, కొత్తగూడెం డీఎస్పీ అబ్దుల్ రెహమాన్, ట్రైనీ ఐపీఎస్ విక్రాంత్, సీఐలు కరుణాకర్, రమేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



కొత్తగూడెం బస్టాండ్ సెంటర్‌లో ట్రాఫిక్ మళ్లిస్తున్న పోలీసులు



సభకు వస్తున్న వారిని తనిఖీ చేస్తున్న పోలీసులు



సభలో భద్రతా ఏర్పాట్లు పరిశీలిస్తున్న పోలీసు అధికారులు



కళాకారులతో కలిసి నృత్యం చేస్తున్న అశ్వారావుపేట ఎమ్మెల్యే జారె ఆదినారాయణ

హైలైట్స్..

- సీఎం రేవంత్‌రెడ్డి మధ్యాహ్నం 11:50 గంటలకు ప్రగతి మైదనంలోని హెలీప్యాడ్ వద్ద దిగారు.
- 12 గంటలకు ప్రకాశం స్టేడియానికి, 12:03 గంటలకు వేదికపైకి వచ్చారు.
- 12:05 గంటలకు శాలువలతో మంత్రులు, జిల్లా కాంగ్రెస్ నాయకులు సన్మానించారు.
- 12:48 గంటల నుంచి 1:14 గంటలకు వరకు ప్రసంగించారు.
- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క 12:36 నుంచి 12:46 గంటల వరకు ప్రసంగించారు.
- సీఎంను ప్రసంగానికి పిలిచాక ఉప ముఖ్యమంత్రిని ప్రసంగించాల్సిందిగా కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని కోరారు.
- సభలో ఉక్కపోత ఎక్కువ ఉండగా, దూర ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు జర్మనీ టెంట్ నుంచి బయటకు వెళ్లారు.
- సీఎం సభ జరుగుతుండగా ప్రజలు వాటర్ ప్యాకెట్లు విసురుకున్నారు.
- సీఎం మాట్లాడుతుండగా ఉక్కపోత తట్టుకోలేక సభికులు సభా ప్రాంగణం నుంచి బయటకు వెళ్లారు.
- సీఎం ప్రసంగం ముగిశాక, క్వానాయ్ వెళ్లే వరకు ప్రజలను ప్రకాశం స్టేడియం నుంచి బయటకు రాకుండా గేట్లకు పోలీసులు తాళం వేశారు.
- కేంద్ర ప్రభుత్వం తెలంగాణకు గాడిద గుడ్డు ఇచ్చిందంటూ సీఎం గుడ్డు ఆకారం చూపించారు. –కొత్తగూడెంరూరల్



సీఎంకు దట్టీ కడుతున్న కాంగ్రెస్ నాయకుడు ముస్తఫా



రేవంత్‌రెడ్డిని సన్మానిస్తున్న పొంగులేటి ప్రసాదరెడ్డి

సీఎంకు ఘన స్వాగతం..



సీఎంకు స్వాగతం పలుకుతున్న మంత్రులు, ఎమ్మెల్యే

కొత్తగూడెంరూరల్: ప్రకాశం స్టేడియంలో జన జాతరసభకు హాజరైన సీఎం రేవంత్‌రెడ్డి ప్రగతి మైదానంలో ఏర్పాటు చేసిన హెల్ ప్యాడ్‌లో దిగారు. ఈ సందర్భంగా ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావులు పుష్పగుచ్ఛం అందించి ఘన స్వాగతం పలికారు. మధ్యాహ్నం 11:50 గంటలకు హెలీప్యాడ్‌లో దిగగా, 12 గంటలకు ప్రకాశం స్టేడియం చేరుకున్నారు.

సీఎం హెలికాప్టర్ తనిఖీ



హెలికాప్టర్‌లో తనిఖీ చేస్తున్న ఫ్లయింగ్ స్క్వాడ్

కొత్తగూడెంటౌన్: ప్రత్యేక హెలికాప్టర్‌లో వచ్చిన సీఎం రేవంత్‌రెడ్డి ప్రగతిమైదానంలో దిగి కాన్వాయ్‌లో సభాస్థలికి చేరుకున్నారు. ఎన్నికల కోడ్ నేపథ్యంలో సీఎం ప్రయాణించిన హెలికాప్టర్, కాన్వాయ్‌లోని కార్లను ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారి పి.రాకేష్, జి.కార్తీక్ తదితరులు తనిఖీలు చేపట్టారు.

బీజేపీ మళ్లీ గెలిస్తే ప్రమాదంలో రాజ్యాంగం

- బీఆర్‌ఎస్ బీజేపీకి బీ టీమే..
- మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు



మాట్లాడుతున్న మంత్రి శ్రీనివాసరెడ్డి, పక్కన మంత్రి తుమ్మల, ఎమ్మెల్యే రాగమయి, ఎంపీ అభ్యర్థి రఘురాంరెడ్డి తదితరులు

సత్తుపల్లి: బీజేపీ మళ్లీ గెలిచినా.. రాహుల్‌గాంధీని ప్రధానమంత్రిని చేసుకోలేకపోయినా రాజ్యాంగం ప్రమాదంలో పడుతుందని, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ రిజర్వేషన్లను రద్దు చేస్తారని రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. సత్తుపల్లి బస్టాండ్ సెంటర్‌లో శనివారం రాత్రి ఏర్పాటుచేసిన కార్నర్ మీటింగ్‌లో ఆయన మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి, ఖమ్మం లోక్‌సభ అభ్యర్థి రామసహాయం రఘురాం రెడ్డితో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా పొంగులేటి మాట్లాడుతూ కులాలు, మతాలు, ప్రాంతాల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టి రాజకీయ లబ్ధితో మూడోసారి ప్రధాని కావాలని నరేంద్రమోదీ కలలు కంటున్నారని తెలిపారు. పదేళ్ల అధికారంలో ఉన్న బీజేపీ తెలంగాణకు ఏమీ ఇవ్వకపోగా.. మాజీ సీఎం కేసీఆర్ దోచుకున్న రూ.లక్షన్నర కోట్లను కాపాడుకునేందుకు బీజేపీతో చీకటి ఒప్పందం చేసుకున్నారని విమర్శించారు. బీజేపీకి బీఆర్‌ఎస్ బీ టీంగా వ్యవహరిస్తున్నందునే నామ నాగేశ్వరరావు గెలిస్తే కేంద్ర మంత్రి పదవి వస్తుందని ప్రచారం చేస్తున్నారని తెలిపారు.

ఆగస్టు 15 కల్లా రుణమాఫీ..

సీఎం రేవంత్‌రెడ్డి చెప్పినట్లు ఆగస్టు 15 కల్లా రైతుల రుణమాఫీ చేస్తామని, రైతు భరోసా అందని రైతులకు త్వరలో అందిస్తామని రాష్ట్ర తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. మచ్చలేని రామసహాయం రఘురాంరెడ్డి కుటుంబం నెహ్రూ, ఇందిరా, రాజీవ్‌గాంధీతో కలిసి పని చేసిందన్నారు. ప్రజల అవసరాల కోసం ఆస్తులు ఇచ్చిన ఆ కుటుంబ సభ్యులైన రఘురాంరెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కాగా, సత్తుపల్లి ప్రాంతానికి గోదావరిజలాలు తీసుకురావడం తన చిరకాల కోరిక అని తెలిపారు. అనంతరం అభ్యర్థి రఘురాంరెడ్డి మాట్లాడుతూ జిల్లా మంత్రుల సహకారంతో జిల్లా అభివృద్ధికి పాటుపడేలా తనకు గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి, దయానంద్ మాట్లాడుతూ లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థికి 50వేల మెజార్టీ తగ్గకుండా పార్టీ శ్రేణులు పని చేయాలని సూచించారు. సత్తుపల్లి గత ఐదేళ్లు మాఫియా చేతుల్లోకి ఉందని విమర్శించారు. డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గా ప్రసాద్, నాయకులు మువ్వా విజయబాబు, పిడమర్తి రవి, నున్నా రామకృష్ణ, ఉడతనేని అప్పారావు, చల్లగుళ్ల నర్సింహారావు, తోట సుజలరాణి, గాదె చెన్నారావు, ఎం.డీ.కమల్‌పాషా, ఎస్.కే.మౌలాలీ, దూదిపాల రాంబాబు, మందపాటి పద్మజ్యోతిరెడ్డి, మోరంపూడి పాండు, దండు ఆదినారాయణ పాల్గొన్నారు.

హామీల అమలులో కాంగ్రెస్ విఫలం

బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి నామ



మధిరలో మాట్లాడుతున్న నామ నాగేశ్వరావు

మధిర/ఎర్రుపాలెం: హామీలు అమలును విస్మరించిన కాంగ్రెస్‌కు గుణపాఠం చెప్పేలా లోక్‌సభ ఎన్నికల్లో తనను గెలిపించాలని ఖమ్మం లోక్‌సభ బీఆర్‌ఎస్ అభ్యర్థి నామ నాగేశ్వరరావు కోరారు. తెలంగాణ ప్రజల హక్కులను పరిరక్షించుకోవాలంటే పార్లమెంట్‌లో బీఆర్‌ఎస్ ఎంపీలు ఉండాల్సిన అవసరముందన్నారు. మధిర, ఎర్రుపాలెం మండలం బనిగండ్లపాడులో శనివారం రాత్రి నిర్వహించిన ఎన్నికల ప్రచార సభల్లో ఆయన మాట్లాడారు. అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారంటీలను నమ్మి ఓట్లు వేసిన తాము తప్పు చేశామని ఇప్పటికే ప్రజలు గుర్తించాన్నారు. ఈనేపథ్యాన అన్నివర్గాల ప్రజలకు మేలు చేసిన బీఆర్‌ఎస్‌కు ఓటు వేసి గెలిపించాలని కోరారు. అంతేతప్ప మరోమారు కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపించి తప్పు చేయొద్దని పిలుపునిచ్చారు. ఈ సమావేశాల్లో ఈకార్యక్రమంలో జడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజ్, మాజీ ఎమ్మెల్యే కొండబాల కోటేశ్వరరావు, డీసీసీబీ చైర్మన్ మాజీ కూరాకుల నాగభూషణం, జెడ్పీటీసీ శీలం కవిత, మున్సిపల్ చైర్ పర్సన్ మొండితోక లతతో పాటు నాయకులు, ప్రజాప్రతినిధులు రావూరి శ్రీనివాసరావు, పల్లపోతు వెంకటేశ్వరరావు, బిక్కి కృష్ణప్రసాద్, అరిగే శ్రీనివాసరావు, చిత్తారు నాగేశ్వరరావు, చావా రామకృష్ణ, పంబి సాంబశివరావు, బొగ్గుల భాస్కర్‌రెడ్డి, చావా వేణు, కూనా నరేందర్ రెడ్డి, అబ్బూరి రామన్ తదితరులు పాల్గొన్నారు.

సుబాబుల్ తోట దగ్ధం

బోనకల్: మండలంలోని ముష్టికుంట్లలో ఉట్ల నరేంద్రబాబుకు చెందిన ఆరెకరాల సుబాబుల్ తోట కాలిపోయింది. దీంతో సుమారు రూ.6లక్షల నష్టం వాటిల్లగా అధికారులు విచారణ జరిపి తనకు న్యాయం చేయాలని ఆయన కోరాడు. అయితే, తోటకు ప్రమాదవశాత్తు నిప్పంటుకుందా, కావాలనే ఎవరైనా నిప్పంటించారా అనేది తెలియాల్సి ఉంది.

చింతపండు బస్తాల మధ్య గంజాయి రవాణా..

నలుగురు అరెస్ట్..
నిందితుల్లో ఖమ్మం జిల్లా వాసి



నిందితుల వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ దేవేందర్‌రెడ్డి

వరంగల్ క్రైం: చింతపండు, యూరియా బస్తాల మధ్య గంజాయి రవాణా చేస్తున్న నలుగురిని అరెస్ట్ చేసి రూ.2.35 లక్షల విలువైన 9.5 కిలోల గంజాయితో పాటు నాలుగు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు హనుమకొండ ఏసీపీ దేవేందర్‌రెడ్డి తెలిపారు. ఈమేరకు శనివారం హనుమకొండ పీఎస్‌లో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. స్నేహితులైన ఏపీలోని ఎన్‌టీఆర్ జిల్లా వీర్లపాడు మండలం పొన్నవరానికి చెందిన ఈదవ కృష్ణ నాగేశ్వరరావు, ఖమ్మం జిల్లా చింతకాని మండలం కొదుమూరుకు చెందిన అనుమోలు వెంకటరమణ సులభంగా డబ్బు సంపాదించేందుకు ఏపీలోని సీలేరుకు చెందిన సురేష్ వద్ద గంజాయి కొనుగోలు చేశారు. ఎవరికి అనుమానం రాకుండా చింతపండు, యూరియా బస్తాల నడుమ గంజాయి బస్తాలు పెట్టి హనుమకొండ జిల్లా శాయంపేటకు చెందిన మహ్మద్ అబ్దుల్ రహీం, మధ్యప్రదేశ్‌లోని రీవా జిల్లా మన్గవ్ మండలం ధారావిఘకు చెందిన శ్రీకర్ త్రిపాఠికి అందజేసేందుకు శుక్రవారం బస్సులో హనుమకొండ బస్టాండ్‌కు వచ్చారు. ఈమేరకు పక్కా సమాచారంతో తనిఖీలు చేపట్టిన హనుమకొండ ఎస్సై శ్రవణ్‌కుమార్ వీరిని అదుపులోకి తీసుకుని విచారించగా నేరాన్ని ఒప్పుకున్నారు. కాగా, ముఠా సభ్యుడైన ఏపీలోని సీలేరుకు చెందిన సురేష్ పరారీలో ఉన్నాడని ఏసీపీ వివరించారు.

క్రీడా సెక్రటరీ పోస్టుకు జోరుగా పైరవీలు !

పాల్వంచ : కేటీపీఎస్ ఏడో దశ కర్మాగారంలో క్రీడా సెక్రటరీ పోస్టు కోసం పైరవీలు జోరుగా సాగుతున్నాయి. గత రెండు దశాబ్దాలుగా కార్యదర్శిగా పనిచేస్తున్న ఏడీఈ వై.వెంకటేశ్వర్లు ఏప్రిల్ 30న ఉద్యోగ విరమణ పొందారు. దీంతో ఆ పోస్టును దక్కించుకునేందుకు పలువురు ఉద్యోగులు ఆసక్తి చూపిస్తున్నారు. జెన్‌కో సంస్థలో కేటీపీఎస్ కాంప్లెక్స్‌కు క్రీడల్లో ప్రత్యేక స్థానం ఉంది. ప్రతి ఏటా ఇక్కడి ఉద్యోగులు రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో వివిధ క్రీడల్లో రాణిస్తుంటారు. అంతేగాక కేటీపీఎస్ 5, 6 దశలు, 7వ దశ కర్మాగారాలు వేర్వేరుగా జెన్‌కో ఇంటర్ ప్రాజెక్ట్స్ క్రీడా పోటీలు నిర్వహిస్తుంటాయి. ఈ క్రమంలో ఎంతో నైపుణ్యం కలిగిన సీనియర్ క్రీడాకారులు ఇక్కడే ఎక్కువగా ఉన్నారు. దీంతో క్రీడా విభాగానికి ఎంతో ప్రాముఖ్యత ఉంది.

ఎవరి ప్రయత్నం వారిదే..

కేటీపీఎస్ ఏడో దశ కర్మాగారంలో సెక్రటరీగా వై.వెంకటేశ్వర్లు విశేష సేవలు అందించారు. క్రీడాకారులకు ఎలాంటి లోటు లేకుండా చూశారు. ప్రతి సంవత్సరం మూడు రోజుల పాటు రాష్ట్ర స్థాయి పోటీలు నిర్వహించారు. ఆయన ఉద్యోగ విరమణతో గతంలో క్రీడా కార్యదర్శిగా అనుభవం గల ఓ ఈఈ స్థాయి అధికారి తననే ఈ పోస్టు వరిస్తుందనే ఆశాభావంతో ఉన్నారు. కాగ సైలో డీఈ, మరో సివిల్ ఏడీఈ, ఎల్‌డీసీ, ఇద్దరు ఉద్యోగులతో పాటు, గతంలో పనిచేసిన సెక్రటరీ అనుచరులు సైతం ఈ పోస్టు దక్కించుకునేందుకు ఉవ్విళ్లూరుతున్నారు. ఇందుకోసం ఎవరి స్థాయిలో వారు పైరవీలు చేసుకుంటున్నారు. ఇప్పటికే కొందరు.. జెన్‌కో డైరెక్టర్ల వద్దకు వెళ్లి క్రీడా కార్యదర్శిగా తననే నియమించాలని కోరుతున్నట్లు తెలిసింది. ఈ పదవి భర్తీకి రెండేళ్లకోసారి ఎన్నికలు నిర్వహించాల్సి ఉండగా, ఇంతకాలం ఎన్నిక లేకుండా ఏకగ్రీవంగానే నియమించారు. అయితే ఈసారైనా ఎన్నికలు నిర్వహించాలని పలువురు క్రీడాకారులు కోరుతున్నారు.

రామయ్యకు వైభవంగా సువర్ణ తులసీ అర్చన



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

భద్రాచలం: భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామి వారికి శనివారం వైభవంగా సువర్ణ తులసీ అర్చన నిర్వహించారు. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం మేళతాళాల నడుమ గర్భగుడి నుంచి తీసుకొచ్చి బేడా మండపంలో కొలువుదీర్చారు. అక్కడ విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం అనంతరం స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

కలప స్వాధీనం

దుమ్ముగూడెం: మండలంలోని నర్సాపురం సమీపంలో గోదావరి నది ఒడ్డున అక్రమంగా నిల్వ ఉంచిన కలపను శనివారం అటవీశాఖ అధికారులు పట్టుకున్నారు. కలపను స్వాధీనం చేసుకుని రేంజ్ కార్యాలయానికి తరలించినట్లు భద్రాచలం అటవీ రేంజ్ అధికారి రంజిత తెలిపారు. పట్టుకున్న కలప విలువ సుమారు రూ.లక్ష ఉంటుందని పేర్కొన్నారు.

చికిత్స పొందుతున్న సీపీఎం నాయకుడు మృతి



మురళీకృష్ణ (ఫైల్)

రఘునాథపాలెం: ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడిన మండలంలోని కామంచికల్‌కు చెందిన సీపీఎం నాయకుడు చెరుకూరి మురళీకృష్ణ(59) చికిత్సపొందుతూ శనివారం మృతి చెందారు. గత నెల 23న ఖమ్మంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన మురళీకృష్ణకు ఖమ్మంలోని ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స చేయిస్తున్నారు. శనివారం పరిస్థితి విషమించి మృతి చెందగా.. ఆయన మృతదేహాన్ని స్వగ్రామానికి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా సీపీఎం రాష్ట్ర, జిల్లా కార్యదర్శులు తమ్మినేని వీరభద్రం, నున్నా నాగేశ్వరరావు తదితరులు మురళీకృష్ణ మృతదేహం వద్ద నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. నాయకులు యర్రా శ్రీకాంత్, ఎస్.నవీన్‌రెడ్డి, నండ్ర ప్రసాద్‌తోతో పాటు సీపీఐ, బీఆర్‌ఎస్ నాయకులు పలువురు కూడా ఆయన మృతదేహం వద్ద నివాళులర్పించారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి...

కామేపల్లి: మండలంలోని బాసిత్‌నగర్‌కు చెందిన బాదావత్ రవి(38) ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. మద్యానికి బానిసైన ఆయన కుటుంబాన్ని పట్టించుకోకపోవడంతో భార్య సుశీల మందలించింది. దీంతో శుక్రవారం తెల్లవారుజామున పురుగుల మందు తాగిన రవిని ఖమ్మం తరలించి చికిత్స చేయిస్తుండగా మృతి చెందాడు. ఘటనపై ఆయన భార్య ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ ప్రవీణ్‌కుమార్ తెలిపారు.

వడదెబ్బతో ఒకరు..



దర్గయ్య (ఫైల్)

తల్లాడ: మండలంలోని అన్నారుగూడెంకు చెందిన తాళ్లూరి దర్గయ్య(45) వడదెబ్బతో మృతి చెందాడు. గతంలో వివిధ పత్రికల్లో జర్నలిస్టుగా పనిచేసిన ఆయన శుక్రవారం వడదెబ్బ కారణంగా అస్వస్థతకు గురైన ఆయనకు ఆర్‌ఎంపీ వద్ద ప్రాథమిక చికిత్స అనంతరం ఖమ్మం తరలించారు. అక్కడ చికిత్స చేయిస్తుండగా పరిస్థితి విషమించడంతో శనివారం మృతి చెందాడు. దర్గయ్యకు భార్య, ఇద్దరు కుమారులు ఉండగా, వివిధ పార్టీల నాయకులు, జర్నలిస్టులు ఆయన మృతదేహం వద్ద నివాళులర్పించారు.

బావిలో మునిగి వ్యక్తి...



నర్సయ్య (ఫైల్)

రఘునాథపాలెం: మండలంలోని కోయచలకకు చెందిన కూలీ బొరిగర్ల నర్సయ్య(43) ఈతకు వెళ్లి ప్రమాదవశాత్తు బావిలో మునిగి మృతి చెందాడు. ఆయన భార్య, కుమారుడి నుంచి విడిపోయి కొన్నేళ్లుగా తల్లి వద్దే ఉంటూ కూలీ పనులు చేస్తున్నాడు. వేసవిలో రోజు మాదిరి శనివారం గ్రామ సమీపాన బావిలో ఈతకు వెళ్లిన ఆయన నీటిలో మునగగా పైకి రాలేదు. దీంతో అనుమానం వచ్చిన యువకులు వెతకగా బావి అడుగున నాచు తీగలకు చుటుటకుని ఉండడంతో బయటకు తీసుకురాగా అప్పటికే నర్సయ్య మృతి చెందాడు. ఘటనపై రఘునాథపాలెం పోలీసులు కేసు నమోదు చేయగా.. నిరుపేద అయిన ఆయన అంత్యక్రియల కోసం గ్రామస్తులు విరాళాలు సేకరించారు.

హెడ్ కానిస్టేబుల్ మృతిపై సంతాపం



జ్ఞానసుందరం (ఫైల్)

ఖమ్మంక్రైం: ఖమ్మం శివారు అగ్రహారం కాలనీలో నివాసముంటున్న ఏఆర్ హెడ్ కానిస్టేబుల్ జ్ఞాన సుందర్‌రావు ఇటీవల అనారోగ్యం బారిన పడగా చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి మృతిచెందాడు. ఈమేరకు ఆయన సహచరులు, పోలీస్ అసోసియేషన్ బాధ్యులు శనివారం ఆయన మృతదేహం వద్ద నివాళులర్పించి కుటుంబానికి రూ.20వేల ఆర్థికసాయం అందజేశారు. పోలీస్ అసోసియేషన్ నాయకులు వెంకటేశ్వర్లు, మోహన్‌రావు, ఆర్ఐ కామరాజు పాల్గొన్నారు.


ప్రజక్తా కోలి


కుష కపిల


ప్రశస్తి సింగ్



మీ నవ్వుల చల్లదనాన్ని మంచుకొండ అప్పుడిగింది...

ఒకరు జోక్ వేస్తే నవ్వడం చాలా వీజీ. నవ్వించడం మాత్రం నవ్వినంత ఈజీ కాదు. టోటల్‌గా చెప్పొచ్చేదేమిటంటే... నవ్వించడం అనేది అత్యంత కష్టతరమైన టాస్క్. ఈ నవ్వుల మహారాణులు మాత్రం అవలీలగా నవ్వులు పూయిస్తూ సోషల్ మీడియాలో లక్షలాది మంది అభిమానులను సంపాదించుకున్నారు.

నిఫ్ట్ గ్రాడ్యుయేట్ అయిన కుష కపిల బిల్లీ మసి, సౌత్ ఢిల్లీ గర్ల్స్‌లాంటి క్యారెక్టర్లతో నవ్వుల వర్షం కురిపిస్తోంది. ఆమెకు 1.6 మిలియన్‌ల ఫాలోవర్‌లు ఉన్నారు. నిత్యజీవిత సంఘటనల ఆధారంగా ఢిల్లీకి చెందిన డాలీసింగ్ కామెడీనీ మేడ్ ఈజీ చేసింది. ముంబైకి చెందిన ప్రజక్తా కోలి కామెడీ వీడియోలు మోస్ట్ పాపులర్ అయ్యాయి. అబ్జర్వేషనల్ కామెడీకి ఆమె వీడియోలు అద్దం పడతాయి. కోలికి యూట్యూబ్‌లో 6 మిలియన్‌ల ఫాలోవర్‌లు ఉన్నారు. స్టాండ్–అప్ కమెడియన్‌గా దేశవ్యాప్తంగా పేరు తెచ్చుకుంది ప్రశస్తి సింగ్. అమెజాన్ ప్రైమ్ వీడియో సిరీస్ 'కామిక్‌స్థాన్' సూపర్ హిట్ అయింది. ఎంబీఏ చేసిన ప్రశస్తి 'నవ్వించడం' తన ప్యాషన్ అంటోంది. వీరు మాత్రమే కాదు కనీజ్ సుర్క, శ్రిష్టి దీక్షిత్, నిహారిక ఎన్‌ఎం, సుప్రియ జోషి, సుముఖి సురేష్, ఐశ్వర్య మోహన్‌రాజ్, సుమైర... లాంటి ఎంతో మంది నవ్వుల ప్రపంచంలో మహారాణులుగా వెలిగిపోతున్నారు.

వైరల్

సిగ్నల్ నీడలో



బతుకు గడవాలంటే రోడ్డు మీదకు రాక తప్పదు. వస్తే భయంకరమైన ఎండ. దాంతోపాటు ట్రాఫిక్ సిగ్నల్ దగ్గర వేచి ఉండాల్సిన బాధ. అందుకే పాండిచ్చేరి ప్రభుత్వం ప్రతి ట్రాఫిక్ సిగ్నల్ దగ్గర గ్రీన్‌షేడ్ ఏర్పాటు చేసింది. వీటిని ఒక స్కూటరిస్ట్ 'ఎక్స్'లో షేర్ చేశాడు. వైరల్ అయిన ఈ పందిళ్లను చూసి చాలా మంది తమ నగరాల్లో కూడా ఇలా జరిగితే బాగుండని కోరుకుంటున్నారు.

మన దేశంలో ఎండలు విపరీతమవడం గతంలో కూడా ఉంది. సాధారణంగా మైదానప్రాంతాల్లో 40 డిగ్రీల సెల్సియెస్, కొండ ప్రాంతాల్లో 30 డిగ్రీల సెల్సియెస్ దాటితే వడగాడ్పు ఉన్నట్టు వాతావరణ శాఖ ప్రకటిస్తుంది. 2016లో జోధ్‌పూర్‌లో 51 డిగ్రీల రికార్డు టెంపరేచర్ నమోదైంది. 2019లో లాంగెస్ట్ హీట్‌వేవ్‌ను దేశం చూసింది. 32 రోజుల పాటు సాగిన వడగాడ్పులకు ఆంధ్రప్రదేశ్ అల్లాడిపోయింది విదర్భ, రాజస్థాన్ కాకుండా. అందుకే మన దేశంలో మే నెలను చూసి జనం గడగడ వొణుకుతారు. బయటికొస్తే వాహనదారులకు నిలువ నీడ ఉండదు. ఇలాంటి సమయంలో పాండిచ్చేరిలో ప్రభుత్వం ప్రతి ట్రాఫిక్ సిగ్నల్ దగ్గర గ్రీన్‌షేడ్స్ ఏర్పాటు చేసింది. దీని వల్ల ఎండలో తిరిగే వారికి నీడ కింద ఉపశమనం దొరికినట్టవుతుంది... దాంతో పాటు ట్రాఫిక్ సిగ్నల్‌ను పాటించినట్టవుతుంది. ఒక వాహనదారుడు ఇన్‌స్టాలో రిలీజ్ చేసిన పాండిచ్చేరి గ్రీన్‌షేడ్స్‌ను చూసి ప్రతి ఒక్కరూ మా నగరాల్లో కూడా ఇలాంటివి ఏర్పాటు చేస్తే బాగుండు అంటున్నారు. ప్రభుత్వాలు వింటే బాగుండు.

నీటి పిట్టలు



'స్విమింగ్ పూల్ అంటే ఎలా ఉంటుంది సార్?'
అని అడిగారా పల్లెటూరి స్కూల్ పిల్లలు.
స్కూల్ ప్రిన్సిపల్‌కి చివుక్కుమంది.
ఎండల్లో జలకాలాడే చిన్న సరదా కూడా
తన స్కూల్ పిల్లలకు లేకపోతే ఎలా అనుకున్నాడు.
ఆ తర్వాత అతడేం చేశాడు?
పిల్లలు నీటి పిట్టలు ఎలా అయ్యారు?
వైరలైన ఈ వివరం వినండి.

ఉత్తరప్రదేశ్‌లో అత్తర్ల తయారీకి వాసికెక్కిన కన్నౌజ్‌కు పక్కనే ఉండే తిర్వా అనే ఊరిలోని ఒక ప్రయివేటు స్కూల్ విద్యార్థులకు స్విమ్మింగ్ పూల్ ఎలా ఉంటుందో తెలియదు. 'వేసవి కాలంలో నగరాల్లో డబ్బున్నవాళ్లు స్విమ్మింగ్‌పూల్‌కు వెళ్లి ఈత కొడతారు' అని స్కూల్ ప్రిన్సిపాల్ వైభవ్ సింగ్ పిల్లలకు మాటవరసకు చెప్తే పిల్లలు 'అదెలా ఉంటుంది సార్' అనడిగారు. 'మేమెందుకు అలాంటి పూల్‌లో ఈత కొట్టకూడదు' అనంటే మన చుట్టుపక్కల పూల్స్ లేవు అని ప్రిన్సిపాల్ అన్నాడు. కాని అతనికి ఒక ఆలోచన వచ్చింది. ఒక క్లాస్‌రూమ్‌లో నీళ్లు నింపి ఇదే పూల్ అన్నాడు. తల్లిదండ్రుల అనుమతి అడిగి స్కూల్ అయ్యే సమయానికి అందులో కేరింతలు కొట్టే అవకాశం ఇచ్చాడు. ఇంకేముంది... పిల్లలకు హుషారే హుషారు. స్కూల్ ఎగ్గొట్టడంలో ఘనాపాటీలైన పిల్లలు కూడా పలక తీసుకొని పరిగెత్తుకుంటూ వస్తున్నారు. ఊళ్లోని తల్లిదండ్రులు కూడా వచ్చి పిల్లలు నీళ్లల్లో కేరింతలు కొడుతుంటే చూసి సంతోషపడుతున్నారు. ఈ వీడియో వైరల్ అయ్యింది.

మేండలు బాబోయ్ మేండలు

కూల్ మీమ్స్





















నేడే చూడండి... గుర్రం గారి డ్యాన్స్



'కొత్త బట్టలు కుట్టిస్తారు. గుర్రపు స్వారీ చేయిస్తారు' అని పెళ్లికుమారుడి గురించి మురిపెంగా చెబుతుంది ఓ సిన్మా పాట. ఈ పాట మాట ఎలా ఉన్నా కొన్ని పెళ్లి ఊరేగింపులలో గుర్రం పరేషాన్ చేస్తుంటుంది. లక్నోలో ఒక పెళ్లి ఊరేగింపులో బాంబుల మోత భరించలేక 'ఐ డోన్ట్ లైక్ ఇట్' అంటూ గుర్రం పరుగులు తీసింది. గుర్రంపై ఉన్న పెళ్లికుమారుడు భయంతో లబోదిబో అన్నాడు. ఇక తాజా విషయానికి ఇస్తే... ఒక పెళ్లి ఊరేగింపులో ఒక కుర్రాడు డ్యాన్స్ చేస్తున్నాడు. లెక్క ప్రకారం అయితే పెళ్లి ఊరేగింపు గుర్రం ఇట్టి దృశ్యాలను మౌనంగా చూస్తుంది. మరి మన గుర్రానికి ఏమనిపించిందో తెలియదుగానీ ఆ డ్యాన్సర్‌కు తగినట్లు స్టెప్పులు వేయడం మొదలుపెట్టింది. గుర్రంపై కూర్చున్న వరుడి గుండెల్లో మెట్రో రైళ్లు పరుగెత్తడం మాట ఎలా ఉన్నా... అక్కడ ఉన్న జనాలకు గుర్రం డ్యాన్స్ తెగ నచ్చి ఈలలు వేయించింది. మనోజ్ పటేల్ అనే యూజర్ ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేసిన ఈ వీడియో క్లిప్ 21 మిలియన్‌ల వ్యూస్‌ను సొంతం చేసుకుంది.

హెల్త్

• చర్మంపై వేసవి ఎండ ప్రభావం... జాగ్రత్తలు!

మనపై వేసవి ఎండల ప్రభావాలు ఎలా ఉన్నప్పటికీ... నేరుగా ప్రభావితం చేసేది చర్మాన్నే. ఎండ ప్రభావం ప్రత్యక్షంగా ఉండటంతో మేని రంగు మారడం, చర్మం కమిలిపోవడం వంటివి సహజం. ప్రధానంగా చిన్నపిల్లల్లో చెమటకాయలు వంటి సమస్యలు ఎక్కువగా కనిపిస్తాయి. వేసవి ఎండల్లో చర్మంపై చూపే దుష్ప్రభావాలూ, వాటి నివారణ, చికిత్స వంటి అనేక అంశాలపై అవగాహన కోసం...





వేసవిలో ఈ కింద పేర్కొన్న అనేక రకాల చర్మ సమస్యలు వచ్చే అవకాశముంది.

చెమటకాయలు (మిలీరియా)... చెమటకాయలు ముఖ్యంగా పిల్లల్లోనూ, కొందరు పెద్దల్లో కూడా కనిపిస్తుంటాయి. వేడి వాతావరణంలో చర్మంపైన ఉండే స్వేదగ్రంథులు మూసుకుపోయి వాపు రావడం వల్ల వేసవిలో ఇవి వస్తుంటాయి. చర్మంపైన ఎర్రటి ర్యాష్‌లాగా కొన్నిసార్లు మాడినట్లుగా నలుపురంగులో కనిపిస్తుంటాయి. పిల్లల్లో చెమట గ్రంథులు పూర్తిగా ఎదగక పోవడం, వేడిమి, ఎండలో విపరీతంగా ఆడటం చెమటకాయలు రావడానికి ప్రధాన కారణాలు.

నివారణ / చికిత్స: చెమటకాయలు వచ్చినప్పుడు పిల్లలకు గాలి బాగా ఆడేలా వదులుగా ఉండే దుస్తులు (కాటన్‌వి అయితే మరీ మంచిది) ధరింపజేయాలి.

• గాఢత తక్కువగా ఉండే మైల్డ్ సబ్బులు వాడాలి. • కాలమైన్ లోషన్ రాసుకోవడం మంచిది. • పిల్లలు ఎండల్లో ఎక్కువగా ఆడకుండా జాగ్రత్త పడాలి. చికిత్సలో భాగంగా ప్రిక్లీ హీట్ పౌడర్ వాడాలి. తగ్గకపోతే ఎమోలియెంట్స్ అనే క్రీముల్ని డాక్టర్ సలహా మేరకు రాయాలి.

మంగుమచ్చలు/ మెలాస్మా... చర్మానికి హానికరమైన అల్ట్రా వయొలెట్ కిరణాల ప్రభావం వల్ల చర్మంపైన ఉండే మెలనోసైట్స్ అనే కణాలు పెరిగి, చర్మం నల్లబారుతుంది. ఈ పిగ్మెంటేషన్‌ను మెలాస్మా అంటారు.

జాగ్రత్తలు/ చికిత్స: పిగ్మెంటేషన్ ఉన్నవారు రోజూ రాత్రివేళ కోజిక్ యాసిడ్, ఆర్బ్యుటిన్, విటమిన్-సి ఉన్న క్రీములు రాసుకోవాలి. • 40 ఎస్‌పీఎఫ్ కంటే ఎక్కువగా ఉన్న సన్‌స్క్రీన్‌ను ప్రతి మూడుగంటలకోసారి రాయాలి.

మొటిమలు ఎక్కువగా రావడం.. వేసవి వేడి వాతావరణంలో తేమ (హ్యూమిడిటీ) ఎక్కువగా ఉన్నప్పుడు మన చర్మంపై ఉండే సబేషియస్ గ్రంథులు ఎక్కువగా పనిచేసి, సీబమ్ అనే నూనె లాంటి ద్రవం స్రవిస్తుంది. అలాగే ముఖంపై ఉండే 'పైలో సబేషియస్ యూనిట్' అనే వ్యవస్థ చాలా చురుగ్గా పనిచేయడంతో చర్మంపై ఎక్కువ చెమట పట్టడంతో, సీబమ్ అనే నూనె లాంటి ద్రవాల స్రావాలతోనూ ఈ గ్రంథుల రంధ్రాలు మూసుకుపోతాయి. దాంతో అక్కడ బ్యాక్టీరియా పెరిగి ఇన్‌ఫ్లమేషన్‌కు దారితీస్తుంది. ఇలా ఈ సీజన్ మొటిమల ఎక్కువగా పెరగడానికి కారణమవుతుంటుంది.

నివారణ / చికిత్స : మొటిమల్ని ప్రేరేపించే అంశాల్లో చాక్లెట్లు, కాఫీలోని కెఫిన్ ప్రధానమైనది. అందుకే టీనేజీ పిల్లలకు కొవ్వులు, చక్కెర పాళ్లు తక్కువగా ఉండే ఆరోగ్యకరమైన ఆహారాన్నే ఇవ్వాలి. ఎవరికి వారు తాము తీసుకునే ఆహారాల్లో కొన్ని ఐటమ్స్ సెబేషియస్ గ్రంథులను ప్రేరేపించేవి అని గుర్తిస్తే వాటికి దూరంగా ఉండాలి. ఈ తరహా నివారణ చర్యల తర్వాత కూడా మొటిమలు తగ్గకపోతే అప్పుడు క్వాలిఫైడ్ దర్మటాలజిస్ట్‌ను కలిసి వారి సూచన మేరకు క్లిండామైసిన్ అండ్ ఎడాపలిన్ కాంబినేషన్ ఉన్న క్రీమును ప్రతి రోజూ రాత్రివేళ రాసుకోవాలి. అప్పటికీ తగ్గకపోతే వైద్యుల సలహా మేరకు యాంటీబయాటిక్స్ కూడా వాడాల్సి ఉంటుంది.


డా. కె.ఎస్.ఎన్. రవితేజ
సీనియర్ దర్మటాలజిస్ట్ & కాస్మటాలజిస్ట్

ఈత జబ్బులతో జర భద్రం



ఒకప్పుడు వేసవి సెలవులు రాగానే ఎనిమిదీ పదేళ్ల పిల్లలంతా ఊళ్లలో బావులకు ఈతకు వెళ్లేవారు. ఇప్పుడా సంఖ్య కాస్త తగ్గినా ఇంకా అలా ఈతకెళ్లేవాళ్లు ఉండనే ఉన్నారు. పల్లెలూ, పట్టణాల పిల్లలైతే సెలవులు కాబట్టి దగ్గర్లోని సముద్ర తీరం దగ్గరికి స్నానాలకు వెళ్లడం, నదుల్లో, చెరువుల్లో ఈదులాడటం మామూలే. ఇక నగరవాసుల పిల్లలు స్విమ్మింగ్ క్లాసులంటూ ఈత నేర్చుకోడాలు ఈ సీజన్‌లోనే ఎక్కువ. దానికితోడు టబ్ బాత్‌లూ, అమ్యూజ్‌మెంట్ పార్కుల్లో స్ప్లాష్ బాత్, కృత్రిమ కెరటాల్లో ఈదులాటలూ ఉంటాయి. అయితే ఈత సంబంధమైన వినోదక్రీడల్లో, వాటర్ స్పోర్ట్స్‌లో పిల్లలకు ప్రమాదాలు తెచ్చిపెట్టే ముప్పులు ఉండనే ఉంటాయి. అవేమిటో, వాటి విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలేమిటో చూద్దాం.

ఈత రానప్పుడు... అది స్విమ్మింగ్‌పూల్‌గానీ లేదా చెరువు, వాగు, నదిలో మునిగిపోయే ప్రమాదమే అన్నిటి కంటే పెద్ద ముప్పు. ఇలాంటి సందర్భాల్లో ఈత తెలిసినవారు తప్పక పక్కనే ఉండాలి. పిల్లవాడు మునిగిపోతున్నట్లు గమనించిన వెంటనే ఒడ్డుకు తీసుకువచ్చి సమతలంగా ఉండే ప్రదేశంలో పడుకోబెట్టాలి. కోలుకునేందుకు చేయాల్సిన పరిచర్యలివి...

• ప్రమాదానికి గురైన చిన్నారి తల పక్కకు ఉండేలా, ఎడమవైపు ఒరిగి ఉండేలా చూసుకోవాలి. • ఛాతీని గమనిస్తూ, శ్వాస ఆడుతుందో లేదో చూడాలి. శ్వాస తీసుకోలేకపోతుంటే గదమ భాగం పైకి ఉండేలా చేసి, గొంతులో ఏదైనా అడ్డుగా ఉందేమో చూడాలి... ఉంటే ఆ అడ్డును తొలగించాలి.

• తర్వాత బోర్లా పడుకోబెట్టి వీపుపై మన రెండు అరచేతులు అనించి, బలంగా నొక్కాలి. దీనివల్ల ఊపిరితిత్తుల్లో ఏమైనా నీళ్లు ఉంటే బయటకు వెళ్లిపోతాయి. శ్వాసక్రియ మళ్లీ మొదలవుతుంది. • కొందరు నీళ్లు తాగేస్తారు. అలాంటప్పుడు కడుపుపై విడతలవారీగా నొక్కుతూ నీళ్లు బయటకు వెళ్లేలా చేయాలి. దాంతో శ్వాసక్రియ తేలిగ్గా జరుగుతుంది. నోటితో గాలి ఊదేటప్పుడు పిల్లవాడి ముక్కు మూయాలి. మన నోరు పక్కకు తీసినప్పుడు ముక్కు తెరచి ఉంచాలి. ఈ రెండింటి మధ్య కొంత వ్యవధి ఇస్తూ ఒక క్రమపద్ధతిలో చేస్తుండాలి. • ఆ తర్వాత వాళ్లను పొడిబట్టల్లోకి మార్చాలి.



ఇతర ఆరోగ్య సమస్యలు...

నీళ్ల విరేచనాలు (డయేరియా): ఈదుతున్న నీళ్లలో ఉండే ఈ-కొలై, షిజెల్లా, క్రిప్టోస్పోరీడియమ్, నోరో వైరస్ వంటి సూక్ష్మక్రిముల వల్ల నీళ్ల విరేచనాల సమస్య రావచ్చు. సమస్య తీవ్రతను బట్టి కొన్ని సందర్భాల్లో యాంటీబయాటిక్స్ వంటి మందులతో పాటు దేహద్రవాలను కోల్పోకుండానే, క్రిములను మాత్రం బయటకు పంపేలా చేసే విరేచనాలు కట్టుబడే మాత్రలు వాడాల్సి ఉంటుంది.

చెవిలో నొప్పి లేదా స్విమ్మర్స్ ఇయర్ : 'ఒటైటిస్ ఎక్స్‌టర్నా' అనే ఈ బ్యాక్టీరియల్ ఇన్ఫెక్షన్‌లో చెవి నొప్పి, చెవిలో దురద, నీరుకారడం, చెవి ప్రాంతంలో వాపు కనిపిస్తాయి. దీని నివారణకు ఈత పూర్తి కాగానే తువ్వాలతో చెవుల్ని, ఇయర్ కెనాల్‌నూ పొడిగా మారేలా తుడవాలి. అప్పటికీ తగ్గపోతే డాక్టర్ సలహా మీద చెవుల్లో యాంటీబయాటిక్ చుక్కల మందులు వాడాలి. ఈ ఇబ్బందులు లేకుండా ఉండాలంటే ఈత సమయంలో ఇయర్ ప్లగ్స్ వాడటం మంచిది.

హాట్ టబ్ ర్యాష్: కలుషితమైన నీళ్లలో ఈదటం వల్ల చర్మానికి వచ్చే సమస్య ఇది. ర్యాష్ వచ్చినచోట చర్మం ఎర్రబారి దురద పెడుతుంటుంది. చర్మంపై రోమాంకురాల చివర్లలో చీముపొక్కుల్లా వస్తుంటాయి. స్విమ్‌సూట్ ధరించిన ప్రాంతాల్లో లక్షణాల తీవ్రత మరీ ఎక్కువ. ఈ సమస్య నివారణకు ఈత పూర్తయిన వెంటనే స్విమ్ సూట్ తొలగించి, సబ్బుతో శుభ్రంగా స్నానం చేయాలి.

కళ్లు ఎర్రబారడం: ఈత తర్వాత చాలామంది కళ్లు ఎర్రబారినట్టుగా ఉంటాయి. ఈదులాడే చోట అనేక రకాల మానవ కాలుష్యాలు, ఇతర రసాయనాల వల్ల నీళ్లు కలుషితం కావడమే ఇందుకు కారణం. ఒకవేళ స్విమ్మింగ్‌పూల్‌లో ఇలాంటి సమస్య వస్తే... ఆ నీటిని క్లోరినేషన్ ద్వారా డిస్-ఇన్ఫెక్ట్ చేయాల్సి ఉంటుంది. చెరువు, కొలను వంటి ఇతర వనరులైతే అలాంటి చోట ఈత కొట్టకపోవడమే మేలు.

సైనసైటిస్: నీటి కొలనులు, చెరువుల వంటి చోట్లలో ఈదులాడుతున్నప్పుడు మన తలలో ఉండే సైనస్ అనే ఖాళీ ప్రదేశాలలో నీరు చేరి, అక్కడ సూక్ష్మజీవులు పెరగడం వల్ల ముక్కు నుంచి స్రావాలు కారుతుండటం, ఒక్కోసారి కణతల వద్ద తలలో, చెవుల్లో నొప్పి రావడం వంటి సమస్యలు వస్తుంటాయి. ఇలాంటప్పుడు డాక్టర్ సలహా మేరకు యాంటీబయాటిక్స్, నొప్పి నివారణ మాత్రలు వాడాల్సి రావచ్చు.

ఇతర ఇన్ఫెక్షన్లు : కొన్ని రకాల ఇన్ఫెక్షన్ల వల్ల జ్వరం, ఆకలి తగ్గడం, తలనొప్పి, తీవ్రమైన నిస్సత్తువ వంటి లక్షణాలు కనిపించవచ్చు. అలాగే పిల్లల ప్రైవేట్ పార్ట్స్ దగ్గర పిన్‌వార్మ్స్ వంటి ఇన్ఫెక్షన్లూ వచ్చే ప్రమాదముంది. కొన్ని సందర్భాల్లో ఊపిరితిత్తుల్లోకి కలుషితమైన నీరు ప్రవేశించడం వల్ల తీవ్రమైన దగ్గు లేదా శ్వాస సమస్యలు రావచ్చు.

ఈత సమస్యల నివారణ కోసం...

• పిల్లలు ఈతకొడుతున్నప్పుడు సీఆర్‌పీ వంటి ఫస్ట్ ఎయిడ్ పద్ధతులు, ఈదడం తెలిసిన పెద్దలు తప్పక పక్కనే ఉండి తీరాలి.

• ఈత ఎంతో ఆరోగ్యకరమైన వ్యాయామమైనప్పటికీ దాంతో వచ్చే సమస్యలపై పిల్లలకు అవగాహన కల్పించి, ఆ మేరకు వారు జాగ్రత్తలు తీసుకునేలా వాళ్లలో అవగాహన పెంచాలి. • పిల్లలు ఈదులాడే కొలను, నదులు, చెరువులు శుభ్రంగానే ఉన్నాయని నిర్ధారణ చేసుకున్న తర్వాతే వారిని ఈతకు అనుమతించాలి. స్విమ్మింగ్‌పూల్ అయితే నిర్ణీత వ్యవధుల్లో ఈ నీటిని క్లోరిన్‌తో ట్రీట్ చేసేలా జాగ్రత్తలు తీసుకోవాలి. • వీలైతే పిల్లల చెవుల్లోకి నీరు పోకుండా ఇయర్ ప్లగ్స్, కళ్లకు గాగుల్స్ వంటివి ధరించేలా జాగ్రత్తలు తీసుకోవాలి.


డా. ప్రవీణ్‌కుమార్ కులకర్ణి,
సీనియర్ ఇంటర్నల్ మెడిసిన్ స్పెషలిస్ట్

మెడి టిప్

వాటర్ కూలర్‌తో ఒకింత జాగ్రత్త!

చాలారోజుల తర్వాత వాడుతున్న వాటర్ కూలర్ విషయంలో ఒక్క జాగ్రత్త తప్పనిసరిగా పాటించి తీరాలి. అదేమిటంటే... వాటర్ కూలర్‌లో ఎంతోకొంత నీరు ఉండి, దాన్ని చాలారోజుల పాటు ఆన్ చేయకుండా ఉన్నప్పుడు ఆ వాటర్ కూలర్ మెష్‌లో ఉండే బ్యాక్టీరియాతో 'లీజియొనైర్స్ డిసీజ్' అనే వ్యాధి వచ్చే ప్రమాదం ఉంటుంది. లీజియొన్నెల్లా అనే బ్యాక్టీరియా కారణంగా వచ్చే ఈ వ్యాధి వల్ల లంగ్స్ ప్రభావితమవుతాయంటున్నారు డాక్టర్లు. అప్పటికే ఆస్తమా ఉన్నవారిలో ఈ 'లీజియొనైర్స్ డిసీజ్' మరింత ప్రమాదకరం కావచ్చంటూ హెచ్చరిస్తున్నారు. అందుకే కూలర్ వాడే ముందర ఒకసారి అందులోని పాత నీరంతా డ్రై అయిపోయేలా ఆన్ చేసి ఉంచాలి. ఆ తర్వాత కూడా ఒకసారి ఫ్రెష్‌గా మరికాసిని నీళ్లు పోసి, అవి కూడా పూర్తిగా ఇగిరిపోయేలా చేయాలి. అటు తర్వాత తాజాగా నీళ్లు పోసి, అప్పుడు వాడుకోవాలంటూ డాక్టర్లు సలహా ఇస్తున్నారు.



రిజర్వేషన్లు ఎత్తేసేందుకు కుట్ర

- ఎస్సీ, ఎస్టీ, బీసీలు ఏకం కావాలి
- టీపీసీసీ ఎస్సీసెల్ రాజ్యాంగ పరిరక్షణ దీక్షలో మాజీ ఎంపీ మధుయాష్కీ
- హాజరైన వీహెచ్, మహేశ్‌గౌడ్, ఎ.చంద్రశేఖర్, ప్రీతమ్, గజ్జెల కాంతం



దీక్షలో మాట్లాడుతున్న మహేశ్‌కుమార్ గౌడ్

సాక్షి, హైదరాబాద్: రిజర్వేషన్లు తీసేసేందుకు జరుగుతున్న కుట్రను అడ్డుకునేందుకు దేశ వ్యాప్తంగా ఎస్సీ, ఎస్టీ, బీసీలు ఏకం కావాల్సిన సమయం ఆసన్నమైందని టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్, మాజీ ఎంపీ మధుయాష్కీగౌడ్ పిలుపునిచ్చారు. టీపీసీసీ ఎస్సీ విభాగం ఆధ్వ ర్యంలో శనివారం గాంధీభవన్‌లో రాజ్యాంగ పరిరక్షణ దీక్ష చేపట్టారు. ఎస్సీ సెల్ చైర్మన్ నాగరిగారి ప్రీతం, మాజీ మంత్రి ఎ.చంద్రశే ఖర్, ఆ పార్టీ నేతలు గజ్జెల కాంతం, సతీశ్‌మా దిగ, ఊట్ల వరప్రసాద్, మానవతారాయ్ తది తరులు దీక్ష చేపట్టారు. ఈ దీక్షకు హాజరైన యాష్కీ మాట్లాడుతూ రాజ్యాంగాన్ని మార్చి రిజర్వేషన్లను రద్దు చేసేందుకు బీజేపీ కుట్ర చేస్తోందని ఆరోపించారు. కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ ఎంపీ వి.హనుమంతరావు మాట్లా డుతూ ఈసారి బీజేపీకి 400 సీట్లు వస్తే తన ఇష్టానుసారంగా రాజ్యాంగాన్ని మార్చివేస్తుం దన్నారు. టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మె ల్సీ మహేశ్‌కుమార్ గౌడ్ మాట్లాడుతూ దేశం లో రిజర్వేషన్లు అమలు కావాలంటే బీజేపీని తరిమికొట్టి కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తేవాలని, అలా తెచ్చే బాధ్యత దళితులపైనే ఉందన్నారు.

రిజర్వేషన్లతోనే సమానత్వం

ఎస్ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బ ల్మూరి వెంకట్రావు మాట్లాడుతూ సమానత్వం ఉండాలంటే రిజర్వేషన్లు ఉండాల్సిందేనని స్ప ష్టం చేశారు. మాజీ మంత్రి ఎ.చంద్రశేఖర్ మాట్లాడుతూ గతంలో బీజేపీతో దోస్తీ కారణం గానే కేసీఆర్ కూడా రాజ్యాంగాన్ని మారుస్తా నని అంటున్నారనీ, రాజ్యాంగాన్ని కాపాడుకు నేందుకు బీజేపీతో పాటు బీఆర్‌ఎస్‌కు కూడా బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు.

కాంగ్రెస్, బీఆర్‌ఎస్‌ల పోటీ..

రెండో స్థానం కోసమే!

▶ మొదటి పేజీ తరువాయి

హామీలను అమలు చేయలేని పరిస్థితుల్లో చెప్పుకో వడానికి రేవంత్‌రెడ్డికి, కాంగ్రెస్ పార్టీకి ఏమీ లేకనే.. రాజ్యాంగం మార్పు, రిజర్వేషన్ల రద్దు, గాడిద గుడ్డు అంటూ ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. దేవు డిపై ఒట్లు పెడుతూ దొంగ నాటకాలు ఆడుతు న్నారని విమర్శించారు. ఈ నెల 13న రాష్ట్రంలో లోక్ సభ ఎన్నికల పోలింగ్ ఉన్న నేపథ్యంలో కిషన్‌రెడ్డి 'సాక్షి'కి ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చారు. రాష్ట్రంలో ఎన్ని కల వాతావరణం, ప్రచార పర్వం, రాజకీయ అంశా లపై తన అభిప్రాయాలను వెల్లడించారు. ఇంట ర్వ్యూలోని కీలక అంశాలు ఆయన మాటల్లోనే..

బీజేపీకే అనుకూల వాతావరణం

తెలంగాణలో డబుల్ డిజిట్ సీట్లు వస్తాయన్న నమ్మకం ఉంది. తెలంగాణలో బీజేపీకి అనుకూల వాతావరణం ఉంది. అసెంబ్లీ ఎన్నికల హామీలను నిలబెట్టుకోకపోవడంతో అధికార కాంగ్రెస్‌పై తీవ్ర వ్యతిరేకత ఉంది. పదేళ్ల పాలనలో వైఫల్యాలు, అవినీతి, అక్రమాలు బీఆర్‌ఎస్‌ను వెన్నాడుతు న్నాయి. దీంతో మోదీని గెలిపించాలని ప్రజలు నిర్ణ యించుకున్నారు. రాష్ట్రంలో 12 స్థానాలకు మించి వచ్చినా ఆశ్చర్యపోవాల్సిన అవసరం లేదు. మేం కచ్చితమైన ఎన్నికల కార్యాచరణతో ముందుకెళు తున్నాం. రాష్ట్రంలోని ఒక్కో ఎంపీ సీటు పరిధిలోని ఏడు అసెంబ్లీ సెగ్మెంట్ల వారీగా కమిటీలు, టీమ్‌లు ఏర్పాటు చేశాం. నాయకులంతా సమన్వయంతో పనిచేస్తున్నారు. రాష్ట్ర స్థాయి నాయకులను ఒక్కో అసెంబ్లీకి పంపించాం. ఇవి లోక్‌సభ ఎన్నికలు కాబట్టి ఇంకా ఏ పార్టీ, ఎంపీ అభ్యర్థులు కూడా పోలింగ్‌బూత్ స్థాయి వరకు చేరుకోలేదు. మేం మాత్రం కచ్చితమైన ప్రణాళికతో బూత్ స్థాయి వరకు ఓటర్లను చేరుకున్నాం.

బీజేపీ బలాన్ని పెంచుకుంటున్నాం..

హైదరాబాద్ నుంచి బరిలో ఉన్న మాధవీలత, ఖమ్మం నుంచి పోటీచేస్తున్న వినోద్‌రావు బీజేపీలో ఉన్నవారే, ప్రజాసంఘాల్లో పనిచేస్తున్నవారే. రాష్ట్రంలో బీజేపీ బలాన్ని పెంచుకునేందుకు కొన్ని సీట్లలో ఇతర పార్టీల వారికి, బలమైన అభ్యర్థులకు టికెట్లు ఇచ్చాం. తెలంగాణలో బీజేపీ ఇంకా చిన్న పార్టీ. పెరగాల్సిన అవసరం ఉంది.

సంకీర్ణమైతే దేశం భ్రష్టుపడుతుంది

రాబోయేది సంకీర్ణ యుగమంటూ మాట్లాడుతున్న మాజీ సీఎం కేసీఆర్.. కాంగ్రెస్ సంకీర్ణంలో చేరు తారా? సమాధానం చెప్పాలి. మేం మాత్రం ఆయ నను చేర్చుకునే ప్రసక్తే లేదు. సంకీర్ణమంటే దేశ మైనా, రాష్ట్రమైనా భ్రష్టుపడతాయన్న విషయాన్ని అందరూ గ్రహించాలి. ఎవరికి వారు బ్లాక్ మెయిల్ చేస్తారు. ఆ పరిస్థితి పట్ల ప్రజలు విసిగి వేసారాకే.. 2014లో, 2019లో బీజేపీకి మెజారిటీ కట్టబెట్టారు. ఎన్డీయేను అందలం ఎక్కించారు.

ఈసారి గెలిచాక జమిలి ఎన్నికలే..

మోదీ ప్రధానిగా మూడోసారి బాధ్యతలు చేపట్టా క.. వన్ నేషన్.. వన్ ఎలక్షన్ (జమిలి ఎన్నికలు) విధానంతో ముందుకెళతాం. వచ్చే ఎన్నికలు కలిసే జరుగుతాయి. దేశంలో జనగణనతోపాటు నియోజ కవర్గాల పునర్విభజన జరగాల్సి ఉంది. ఇందులో దక్షిణాదిలో సీట్లు తగ్గుతాయంటూ దుష్ప్రచారం చేయడం ఎంతమాత్రం సరికాదు.

సీఎం, మాజీ సీఎం స్థాయివాళ్లు దిగజారి మాట్లాడుతున్నారు!

ప్రస్తుతం రాజకీయ వాతావరణమంతా కలుషితమై పోయింది. గతంలో ఎన్నికలంటే గ్రామాల్లో పం డుగ వాతావరణం ఉండేది. ఇప్పుడు అసహ్యించు కునే పరిస్థితి తీసుకొచ్చారు. ఏ మాత్రం సంబంధం లేని విషయాలు ప్రస్తావించడం, అబద్ధాలు మాట్లా డటం, ఉపయోగించే భాషపై నియంత్రణ లేకపో వడం పెరిగింది. కొడతా, తిడుతా, చంపుతా, పాదాల కింద నలిపేస్తా అంటూ సీఎం, మాజీ సీఎం స్థాయిల వ్యక్తులు మాట్లాడుతున్నారు. ప్రచారంలో, మాట్లాడే మాటల్లో నైతికత లేకుండా పోయింది. హైదరాబాద్ లోక్‌సభ స్థానం సహా అన్నిచోట్లా డబ్బులే కీలకపాత్ర పోషించే పరిస్థితి ఏర్పడింది.

రాముడి పేరిట కాదు.. అభివృద్ధిని చూపి వస్తున్నాం

బీజేపీ ఎన్నికల ప్రచారంలో ఎక్కడైనా రాముడి ప్రస్తావన ఉందా? మీడియా, వార్తాపత్రికల్లో దీని ప్రాతిపదికన ఎక్కడైనా ఓట్లు అడిగామా? పదే ళ్లలో మేం ఎంత అభివృద్ధి చేశాం, ఏయే రంగానికి ఎన్నెన్ని నిధులిచ్చామో స్పష్టంగా చెప్పి ఓట్లు అడుగుతున్నాం. ఎంత మందికి బియ్యం ఇస్తు న్నాం, రైతులకు ఏం చేశామనేది చెప్తున్నాం. మేం రాముడి పేరిట ఓట్లు అడుగుతున్నామని విమర్శి స్తున్న వారు దీనికి సమాధానం చెప్పాలి.

బీజేపీతోనే తెలంగాణ అభివృద్ధి

దేశంలో సుస్థిర ప్రభుత్వం రావడం ద్వారా అవినీతి, అక్రమాలకు చెక్‌పెట్టవచ్చు. ఉగ్ర వాదాన్ని అరికట్టవచ్చు. అందుకే బీజేపీకి మద్దతు ఇవ్వాలని ప్రజలను కోరుతున్నాం. పదేళ్ల మోదీ పాలనలో తెలంగాణకు ఎంతో మేలు జరిగింది. ఇక ముందు మరింత అభివృద్ధి జరగాలంటే బీజేపీని అత్యధిక సీట్లలో గెలిపించాలని కోరు తున్నాను.

రేవంత్‌కు ముందుంది ముసళ్ల పండుగ

అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా వంద రోజుల్లో ఆరు గ్యారంటీలు అమలు చేస్తామని చెప్పారు. అమలు చేయలేదు. అందుకే కాంగ్రెస్‌కు, రేవంత్‌రెడ్డికి ఓట్లు అడిగే నైతికహక్కు లేదంటున్నాం. మా ఇంటింటి ప్రచారంలో ఈ విషయాన్ని ప్రజలకు చెప్తుంటే మంచి స్పందన వస్తోంది. రేవంత్‌రెడ్డికి ముందుంది ముసళ్ల పండుగ. ఆరు గ్యారంటీలు, 420 వాగ్దానాల అమలు ఎలా చేస్తారు? ఇప్పుడు తొందరపడి ఎగిరెగిరి పడితే సరిపోతుందా? భూములు అమ్మి ఎన్ని లక్షల కోట్లు సంపాదిస్తారు? ఏం చేస్తారనేది ప్రజల ముందు ఉంది. కాంగ్రెస్ పార్టీ 2019 లోక్‌సభ ఎన్నికలతో పోల్చితే ఈ ఎన్నికల్లో మరీ దారుణంగా వ్యవహరిస్తోంది.

రిజర్వేషన్లపై మోదీ స్పష్టత ఇచ్చినా.. రేవంత్ గోబెల్స్ ప్రచారం

ముస్లిం రిజర్వేషన్లను రద్దు చేస్తామని మేం 20 ఏళ్లుగా చెబుతూనే ఉన్నాం. అది మా పార్టీ విధానమని స్పష్టంగా చెప్తున్నాం. మోదీ ప్రధాని అయ్యాక కొత్తగా ఏమీ దీనిని లేవనెత్తలేదు. మతపరమైన రిజర్వేషన్లు రాజ్యాంగ విరుద్ధమని హైకోర్టులు కూడా తీర్పులిచ్చాయి. కానీ విపక్షాలు కావాలని బురద చల్లుతున్నాయి. బీజేపీ మళ్లీ అధికారంలోకి వస్తే రిజర్వేషన్లు రద్దు చేస్తుందంటూ కాంగ్రెస్ పార్టీ, సీఎం రేవంత్‌రెడ్డి పెద్ద ఎత్తున గోబెల్స్ ప్రచారానికి దిగాయి. దీనిపై ప్రధాని మోదీ చాలా స్పష్టమైన ప్రకటన చేశారు. తన కంఠంలో ప్రాణం ఉండగా రిజర్వేషన్ల రద్దు ఉండదని, రాజ్యాంగాన్ని మరింత పటిష్టం చేస్తామని చెప్పారు. అయినా బీజేపీపై దుష్ప్రచారాన్ని కొనసాగిస్తూ.. దాన్ని ఎన్నికల ఎజెండాగా తయారుచేసి పెట్టారు. ప్రజలకు నిజాలు చెప్పాల్సిన బాధ్యత మాపై ఉంది. అందుకే మేం పదే పదే వివరణ ఇవ్వక తప్పని పరిస్థితి ఏర్పడింది. ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణకు బీజేపీ, కేంద్ర ప్రభుత్వం సానుకూ లంగా ఉన్నాయి. ఇది మాదిగలకు అనుకూలం, మాలలకు వ్యతిరేకమనే ఆలోచన తప్పు. జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్ల ఫలాలు అందాలని కోరుకుంటున్నాం.

ఆదాయం రూ.6 వేలు.. ఖర్చు 2 లక్షలు!

ఆదరణ కరువైన సిద్దిపేట-సికింద్రాబాద్ రైలు

- రోజుకు సగటున 250 మంది మాత్రమే ప్రయాణం
- ప్రస్తుతం కేవలం 40 కి.మీ వేగంతో నడుస్తున్న రైలు
- మూడుచోట్ల కొనసాగుతున్న వంతెనల పనులే కారణం
- బస్సు కన్నా గంటకు పైగా ఎక్కువ ప్రయాణ సమయంతో ఆసక్తి చూపించని ప్రజలు

సాక్షి, హైదరాబాద్: ఆ రైలు రోజుకు రెండు ట్రిప్పులు తిరుగుతోంది. ఆ రెండు ట్రిప్పుల్లోనూ అందులో ప్రయాణించే వారి సంఖ్య సగటున 250 మంది మాత్రమే. కాగా టికెట్ల రూపంలో రైల్వేకు రోజుకు వస్తున్న ఆదాయం కేవలం సుమారు రూ.6 వేలు. కానీ ఈ రెండు ట్రిప్పులకు అయ్యే నిర్వహణ వ్యయం ఎంతో తెలుసా? ఏకంగా రూ.2 లక్షలు! సికింద్రాబాద్ – సిద్దిపేట మధ్య తిరుగుతున్న డెమూ రైలు కథ ఇది. పరుగులు పెట్టాల్సిన ఈ రైలు షెడ్యూల్ ప్రకారం గానే అయినా దాదాపు నడుస్తున్నట్టు వెళ్లడమే ఈ పరిస్థితికి కారణం. నగరంలోని జూబ్లీ బస్‌స్టేషన్ నుంచి బయలుదేరే బస్సు 2.15 గంటల్లో సిద్దిపేటకు చేరుకుంటుంటే, ఈ రైల్లో మాత్రం ఇందుకోసం కనీసం 3 గంటల నుంచి మూడున్నర గంటల సేపు ప్రయాణించాల్సి వస్తోంది. ప్రస్తుతం ఈ రైలు సగటు వేగాన్ని అధికారులు గంటకు కేవలం 40 కిలోమీటర్లకే పరిమితం చేశారు. అందుకనే 116 కి.మీ (రైలు రూట్ కి.మీ. ప్రకారం) ప్రయాణానికి 3 గంటలకు పైగా సమయం పడుతోంది. మరోవైపు స్టేషన్ సిద్దిపేటకు దూరంగా ఉంది. దీంతో సిద్దిపేట నుం చి స్టేషన్‌కు రావాలన్నా, స్టేషన్ నుంచి సిద్దిపేటకు వెళ్లాలన్నా ప్రత్యేకంగా ఆటోలో ప్రయాణించాల్సి వస్తోంది. ఇవన్నీ దృష్టిలో ఉంచుకుని ప్రయాణికులు రైలు ఎక్కడం కంటే బస్సు బెటరని అటు మళ్లుతున్నారు.

తప్పనిసరి పరిస్థితుల్లో కొనసాగింపు

రెండు ట్రిప్పుల్లో సగటున నాలుగైదు వేల మంది ప్రయాణించాల్సి ఉండగా 250 కూడా మించటం లేదు. సిద్దిపేటలో 30 మందికి మించి రైలు ఎక్కడం లేదు. సికింద్రాబాద్ నుంచి బయలుదేరి సిద్దిపేట చేరుకునే సరికి అంతే సంఖ్యలో ప్రయాణికులు మిగులుతున్నారు. మధ్యలో ఉండే స్టేషన్లలో ఐదారుగురు చొప్పున ఎక్కి దిగుతున్నారు. కొన్ని సందర్భాల్లో రైల్లో 50-60 మంది ప్రయాణికులు కూడా ఉండటం లేదని సిబ్బంది చెప్పడటం ఈ రైలుకున్న ఆదరణను స్పష్టం చేస్తోంది. ఇలాం టప్పుడు రైల్వే దీనిని డిమాండ్ లేని సర్వీసుగా పరిగణించి రద్దు చేస్తుంది. కానీ భవిష్యత్తులో ఇది కరీంనగర్ (పెద్దపల్లి) వరకు సేవలు అందిం చాల్సిన సర్వీసు కావటంతో, ఇప్పుడు రద్దు చేస్తే మళ్లీ పునరుద్ధరించేందుకు రైల్వే సేఫ్టీ కమిషనర్ తనిఖీ, తదనంతర అనుమతులు రావడం లాంటి తతంగం ఉన్నందున తప్పనిసరి పరిస్థితుల్లో ఈ రైలును కొనసాగిస్తోంది.

ఎందుకింత మెల్లగా..

మనోహరాబాద్ నుంచి సిద్దిపేట వరకు మార్గం సిద్ధం కావటంతో రైలు ప్రారంభించారు. కానీ మధ్యలో మూడు నాలుగు చోట్ల ఆర్‌ఓబీ, ఆర్‌యూబీల నిర్మాణంలో తీవ్ర జాప్యం జరుగుతోంది. సిద్దిపేట-జనగామ రోడ్డులో రం గధాంపల్లి వద్ద ఆర్‌ఓబీ నిర్మాణం జరుగుతోంది. కొమురవెల్లి స్టేషన్ సమీపంలో ఆర్‌యూబీ నిర్మాణం కొనసాగుతోంది. కుకునూరుపల్లి వద్ద ఆర్‌ఓబీ ఇటీవలే పూర్తయింది. ఈ మూడు కీలక నిర్మాణాల కారణంగానే వేగాన్ని బాగా తగ్గించి రైలు నడుపుతున్నారు.

రోజుకు 1,800 లీటర్ల డీజిల్ ఖర్చు

ఇది ఎనిమిది కోచ్‌లుగా ఉండే రేక్. దీనికి రెండు పవర్ కార్‌లుంటాయి. ఒక్కో పవర్ కార్‌కు నాలుగు కోచ్‌లు అటాచ్ అయి ఉంటాయి. ఒక ట్రిప్పునకు (వెళ్లి రావడానికి) 900 లీటర్ల డీజిల్ ఖర్చవుతోంది. రెండు ట్రిప్పులకు 1800 లీటర్లు ఖర్చవుతున్నాయి. ఇక ఈ సర్వీసు సిబ్బందికి ఒకరోజు జీతం రూ.20 వేలుగా ఉంటోంది. ఈ మొత్తం కలిపితే రోజుకు రూ.2 లక్షల ఖర్చవుతోంది.

ఆ దారి బాగు చేయండి

సిద్దిపేట, రైల్వేస్టేషన్‌కు మధ్య (ప్రధాన రహదారి) దాదాపు నాలుగు కి.మీ.దూరం ఉండటం ప్రయాణికులకు ఇబ్బందిగా ఉంది. గుండ్ల చెరువు మీదుగా వెళ్తే ఒకటిన్నర కి.మీ.దూరమే ఉంటుం దని, కానీ ఆ దారి మధ్యలో ధ్వంసం కావటంతో వాహనాల రాకపోకలు కుదరటం లేదని స్థానికులు చెబుతున్నారు. ఈ దారి బాగు చేస్తే తమకు కొం తవరకు సౌకర్యవంతంగా ఉంటుందని అం టున్నారు.

75 కిలోమీటర్లకు పెరగనున్న వేగం

ఆర్‌ఓబీ, ఆర్‌యూబీల పనులను త్వరగా పూర్తి చేసి రైలు వేగాన్ని పెంచాలని ఇటీవల రైల్వే ఉన్నతాధికారులు ఆదేశించారు. దీంతో రైలు గరిష్ట వేగాన్ని 75 కి.మీ.కు పెంచాలని నిర్ణయించారు. అదే జరిగితే ప్రయాణ సమయం దాదాపు 45 నిమిషాలు తగ్గుతుంది. అప్పుడు రెండున్నర గం టల్లోనే రైలు గమ్యం చేరుతుందని, ప్రయాణికుల ఆదరణ పెరుగుతుందని అధికారులు భావిస్తున్నారు.

రైలు వేళలు ఇలా..

➜ సిద్దిపేటలో ఉదయం 6.45 గంటలకు బయలుదేరి 10.15కు సికింద్రాబాద్ చేరుకుం టుంది. ➜ సికింద్రాబాద్‌లో ఉదయం 10.35కు బయలుదేరి మధ్యాహ్నం 1.45కు సిద్దిపేట చేరుకుంటుంది.
➜ సిద్దిపేటలో 2.05కు బయలుదేరి సికింద్రాబాద్‌కు సాయంత్రం 5.20కు చేరుకుంటుంది.
➜ సికింద్రాబాద్‌లో.5.45కు బయలుదేరి రాత్రి 8.45కు సిద్దిపేటకు చేరుకుంటుంది.
➜ మల్కాజిగిరి, కెవలరీ బ్యారక్స్, బొల్లారం, గుం డ్లపోచంపల్లి, మేడ్చల్, మనోహరాబాద్, నాచారం, బేగంపేట, గజ్వేల్, కొడకండ్ల, లకుడారం, దుద్దెడల్లో ఆగుతుంది.

జిల్లా వార్తలు


ఘనంగా కేవీకే స్వర్ణోత్సవాలు



స్వర్ణోత్సవాల్లో పాల్గొన్న శాస్త్రవేత్తలు, రైతులు

వైరా: వైరాలోని కృషి విజ్ఞాన కేంద్రం(కేవీకే)లో శనివారం స్వర్ణోత్సవ వేడుకలు నిర్వహిం చారు. ఈసందర్భంగా శాస్త్రవేత్తలు మాట్లా డుతూ కేవీకే ద్వారా నూతన వ్యవసాయ విధా నాలను అందుబాటులోకి తీసుకొచ్చి రైతులకు అండగా నిలుస్తున్నట్లు తెలిపారు. అలాగే, కేవీకే ద్వారా అందుతున్న సేవలను కోఆర్డినే టర్ డాక్టర్ కె.రవికుమార్ వివరించగా, శాస్త్ర వేత్త ఫణిశ్రీ తదితరులు పాల్గొన్నారు.

రానున్న ఐదేళ్లలో 100 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి



సమావేశంలో మాట్లాడుతున్న సింగరేణి డైరెక్టర్(పా) శ్రీనివాస్

సింగరేణి(కొత్తగూడెం): 2029–30 నాటికి సిం గరేణి సంస్థ పరిధిలో 100 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తికి ప్రణాళిక సిద్ధం చేస్తున్నారు. ఈమేరకు శనివారం కొత్తగూడెంలో బొగ్గు ఉత్పత్తి, ఉత్పాదకత, లాభాల్లో వృద్ధి, వివిధ రంగాల్లో విస్తరణపై వర్క్‌షాపు నిర్వహిం చారు. సీపీపీ, హెచ్‌ఆర్‌డీ విభాగాల ఆధ్వ ర్యాన జరిగిన ఈ కార్యక్రమంలో వివిధ ఏరియాల జనరల్ మేనేజర్లు, ప్రాజెక్ట్ మేనే జర్లు పాల్గొనగా గతేడాది కంటే ఈ ఏడాది 10శాతం వృద్ధి సాధించడానికి చేపట్టాల్సిన అంశాలపై చర్చించారు. ఈసందర్భంగా డైరె క్టర్లు మాట్లాడుతూ విద్యుత్, బొగ్గు వినియోగం పెరుగుతున్న దృష్ట్యా సింగరేణి ఆధ్వర్యాన 100 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి అవసర మని తెలిపారు. ఈ దిశగా కృషి చేస్తూ రక్షణతో కూడిన ఉత్పత్తి సాధించాలన్నారు. ఇందుక కోసం ఆరు ప్రత్యేక కమిటీలు ఏర్పాటు చేయ నుండగా, బొగ్గు ఉత్పత్తిలోనే కాక థర్మల్, సోలార్, జియో థర్మల్ ఉత్పత్తిలో కూడా అభివృ ద్ధి సాధించాలని సూచించారు. ఈ కార్యక్రమం లో డైరెక్టర్లు, వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

మొదటి నెల పర్వాలేదు..

ఆర్థిక సంవత్సరం ప్రారంభ నెలలో 92శాతం బొగ్గు ఉత్పత్తి



ఓపెన్‌కాస్ట్ గనిలో బొగ్గు ఉత్పత్తి చేస్తున్న దృశ్యం

ఏప్రిల్‌లో ఏరియాల వారీగా నమోదైన ఉత్పత్తి

ఏరియా	లక్ష్యం	ఉత్పత్తి	శాతం
ఆర్జీ-2	6,38,400	8,10,702	127
బెల్లంపల్లి	3,00,000	3,14,161	105
ఇల్లెందు	3,22,000	3,29,280	102
మణుగూరు	11,36,500	11,21,828	99
ఆర్జీ-3	5,38,000	5,01,596	93
ఆర్జీ-1	4,26,400	3,76,774	88
కొత్తగూడెం	11,84,000	10,37,000	88
భూపాలపల్లి	3,30,700	2,48,201	75
శ్రీరాంపూర్	5,43,700	3,94,118	74
మందమర్రి	3,61,500	2,61,600	72
ఆండ్రియాల	1,67,800	80,746	48
మొత్తం	59,49,000	54,76,006	92

- ఏప్రిల్‌లో మూడు ఏరియాల్లో వంద శాతం
- రోజువారీ ఉత్పత్తి 87 శాతంగా నమోదు

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి సంస్థ గడిచిన ఆరేళ్లలో లక్ష్యం మేరకు బొగ్గు ఉత్పత్తిలో వెనకబడిం ది. కానీ 2023–24 ఆర్థిక సంవత్సరంలో మాత్రం లక్ష్యం మేరకు 70 మిలియన్ టన్నుల ఉత్పత్తి సాధించింది. ఇక 2024–25 ఆర్థిక సంవత్సరం మొదటి నెల ఏప్రిల్‌లో 58,40,000 టన్నుల లక్ష్యా నికి 54,76,006 టన్నుల(92 శాతం) ఉత్పత్తి మాత్రమే నమోదైంది. మిగిలిన సుమారు 3.5 లక్షల టన్నులు వెనుకంజలో ఉన్నట్లు చెబుతు న్నారు. రోజువారీ ఉత్పత్తిలో సింగరేణి వ్యాప్తంగా 11 ఏరియాల్లోని భూగర్భగనులు, ఓపెన్‌కాస్ట్ గను ల్లో 2,28,957 టన్నుల లక్ష్యానికి 1,83,061 టన్ను లు(87 శాతం) సాధించింది. ఇందులో ఓసీల్లో 94 శాతం, భూగర్భగనుల్లో 77 శాతం ఉత్పత్తి నమోదై నట్లు సింగరేణి అధికారులు వెల్లడించారు.

మూడు ఏరియాల్లో భేష్

సింగరేణి సంస్థ వార్షిక లక్ష్యసాధనలో భాగంగా 11 ఏరియాలకు కొంత మేర లక్ష్యాన్ని నిర్దేశించారు. ఇం దులో రోజువారీ, నెల వారీ లక్ష్యసాధనపై ఉన్న తాధికారులు పర్యవేక్షిస్తున్నా అన్ని చోట్లా మెరుగైన ఫలితాలు రావడం లేదు. ఏప్రిల్‌లో సింగరేణి వ్యాప్తంగా మూడు ఏరియాల్లో వంద శాతం ఉత్పత్తి నమోదైంది. ఇందులో ఆర్జీ–2 ఏరియా 127 శాతం తో అగ్రస్థానంలో నిలవగా, బెల్లంపల్లి ఏరియా 105 శాతం, ఇల్లెందు 102 శాతంతో రెండు, మూడో స్థానాల్లో నిలిచాయి. మిగతా ఎనిమిది ఏరియాలు వెనుకంజలో పడ్డాయి. ఇక ఉత్పత్తి వారీగా చూస్తే మణుగూరు ఏరియా 11, 21,828 టన్నులతో సింగరేణి వ్యాప్తంగా అగ్రస్థానంలో నిలిచింది.

వన్యప్రాణుల వేటకు యత్నించిన ముగ్గురి అరెస్ట్

- తుపాకీ, రెండు వాహనాలు సీజ్
- వివరాలు వెల్లడించిన డీఎఫ్‌ఓ సిద్ధార్థ్



నిందితుల వివరాలు వెల్లడిస్తున్న డీఎఫ్‌ఓ సిద్ధార్థ్ విక్రమ్‌సింగ్

మధిర: మధిర అటవీ రేంజ్‌లోని ఎర్రుపాలెం మం డలం భీమవరం రిజర్వ్ ఫారెస్ట్ అయ్యవారిగూడెం లో నాటుతుపాకీతో వన్యప్రాణుల వేటకు యత్నిం చిన ముగ్గురిని అటవీ శాఖాధికారులు అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా వివరాలను మధిరలో శనివారం ఖమ్మం జిల్లా అటవీ శాఖ అధికారి సిద్ధా ర్థ్ విక్రమ్ సింగ్ వెల్లడించారు. ఏపీలోని ఎన్టీఆర్ జిల్లా గంపలగూడెం మండలం వినగడపకు చెం దిన శ్రీనివాస్ తండ్రికి తుపాకీ ఉండడంతో ఆయన తన స్నేహితులైన అదే గ్రామానికి చెందిన కృష్ణా రావుతో పాటు మధిర మండలానికి చెందిన మారే శ్వరరావు, ఆకుల నాగేశ్వరరావుతో కలిసి వన్యప్రా ణులను వేటాడేందుకు అయ్యవారిగూడెం వచ్చా రని చెప్పారు. ఈమేరకు విశ్వసనీయ సమాచారం తో ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ విజయలక్ష్మి, భీమవరం ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ సురేష్ ఆధ్వర్యాన తనిఖీలు చేపట్టడంతో శ్రీనివాస్, కృష్ణారావు, మారేశ్వరరావు పట్టుబడగా.. నాగేశ్వరరావు పరారయ్యాడని తెలిపారు. అదుపులోకి తీసుకుని విచారించగా వన్యప్రాణులను వేటాడేందుకు వచ్చినట్లు అంగీక రించడంతో తుపాకీ, బులెట్లు, రెండు ద్విచక్ర వాహ నాలను స్వాధీనం చేసుకుని కోర్టులో హాజరుప ర్చినట్లు డీఎఫ్‌ఓ చెప్పారు. కాగా, వీరిని అరెస్ట్ చేయడంలో కీలకంగా వ్యవహరించిన ఎఫ్‌ఆర్‌ఓ విజయలక్ష్మి, ఎఫ్ఎస్‌ఓ సురేష్, ఎఫ్‌బీఓలు నాగేశ్వ రరావు, రమేష్, సురేష్, శ్రీనివాస్, రాజేందర్, రాం బాబును ఆయన అభినందించారు.

అంతర్రాష్ట్ర చెక్ పోస్టుల వద్ద విస్తృత తనిఖీలు

భద్రాచలంటౌన్: లోక్‌సభ ఎన్నికల సమీపి స్తున్న వేళ నగదు, మద్యం అక్రమ రవాణాను అరికట్టేందుకు అంతర్రాష్ట్ర చెక్‌పోస్టుల వద్ద పటి ష్టమైన బందోబస్తు ఏర్పాటు చేసి తనిఖీలు ముమ్మరంగాచేపటట్టాలని ఖమ్మం పార్లమెం ట్ నియోజకవర్గ ఎన్నికల వ్యయ పరిశీలకుడు రాంకుమార్ గోపాల్ సూచించారు. భద్రాచ లంలోని అంతర్రాష్ట్ర చెక్ పోస్ట్, ఎస్ఎస్‌టీ చెక్ పోస్టులతో పాటు వీఎం బంజర సెంటర్‌లోని చెక్‌పోస్ట్‌ను శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా రికార్డులను తనిఖీ చేశాక రాం కుమార్ గోపాల్ మాట్లాడుతూ చెక్‌పోస్ట్‌ల్లో ఉద్యోగులు 24గంటల పాటు అప్రమత్తంగా ఉంటూప్రతీ వాహనాన్ని తనిఖీ చేయాలని తెలిపారు. అలాగే, బ్యాంకు ఖాతాల ద్వారా అనుమానిత లావాదేవీలపై ఆరా తీయాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ సీఐ షేక్ రహమాన్ ఈషా బేగ్, సీఐ సంజీవరావు తదిత రులు పాల్గొన్నారు.

వడదెబ్బ మృతులకు ప్రభుత్వ సాయం

- పోస్టుమార్టం తప్పనిసరి.. వైద్యాధికారి నివేదిక కీలకం
- త్రిసభ్య కమిటీ ద్వారా కలెక్టర్‌కు నివేదిక
- ఆపై రూ.50 వేలు ఆర్థిక సాయం

భద్రాచలంఅర్బన్: ఈ వేసవిలో నానాటికీ ఎండలు పెరుగుతున్నాయి. పలువురు వడదెబ్బ బారిన పడి చికిత్స పొందుతుండగా.. ఇంకొందరు మృ త్యువాత పడుతున్నారు. అయితే, వడదెబ్బ మృ తుల్లో పేద కుటుంబాలకు ప్రభుత్వం ద్వారా పరిహారం అందుతుంది. ఇందుకోసం ప్రతీ మండ లానికి త్రిసభ్య కమిటీని నియమించగా.. వీరు విచారణ జరిపి నివేదికను కలెక్టర్‌కు సమర్పిస్తారు. అక్కడ పరిశీలన అనంతరం రూ.50 వేలు పరి హారం మంజూరు చేస్తారు.

మండలానికో కమిటీ

వడదెబ్బ మృతుల నిర్ధారణకు ప్రతీ మండలానికి త్రిసభ్య కమిటీ ఉంటుంది. ఇందులో తహసీల్దార్, ఇన్‌స్పెక్టర్, వైద్యాధికారి సభ్యులుగా ఉంటారు. వడ దెబ్బతో ఎవరైనా మరణిస్తే ఈ కమిటీకి సమా చారం ఇవ్వాలి. అలాగే, సదరు వ్యక్తి వడదెబ్బతో మృతి చెందినట్లు వైద్యాధికారి ధ్రువీకరిస్తే, ఆపై పోలీసులు కేసు నమోదు చేసి ఆస్పత్రికి మృతదే హాన్ని తరలిస్తారు. అక్కడ పోస్టుమార్టం అనంతరం నివేదికను వైద్యాధికారి అందజేస్తే ఎఫ్‌ఐఆర్‌లో వడదెబ్బ మృతిగా నిర్ధారిస్తారు. ఈ మేరకు నివేది కను తహసీల్దార్ ద్వారా ఆర్డీఓకు అక్కడి నుంచి కలె క్టర్‌కు పంపించి, పరిశీలన అనంతరం బాధిత కుటుంబానికి సాయం విడుదల చేస్తారు. ఈ విష యాన్ని ప్రజలు గమనించి వడదెబ్బ మరణాలపై సమాచారం ఇవ్వాలని అధికారులు సూచిస్తున్నారు.

సమష్టి కృషితోనే సంస్థ అభివృద్ధి

ఆర్టీసీ రీజినల్ మేనేజర్ వెంకన్న



ఉద్యోగిని సన్మానిస్తున్న ఆర్‌ఎం వెంకన్న

మధిర: ఉద్యోగుల సమష్టి కృషితోనే ఆర్టీసీ అభివృద్ధి సాధ్యమవుతుందని, ఇందులో డ్రైవర్లు, కండక్టర్లు కీలకంగా వ్యవహరించాలని ఆర్టీసీ ఖమ్మం రీజనల్ మేనేజర్ సీహెచ్.వెంకన్న సూచించారు. మధిర డిపోలో శనివారం నిర్వహించిన సమావేశంలో పలువురు ఉద్యోగులకు ప్రగతిచక్ర అవార్డులు అంద జేయడంతో పాటు విధి నిర్వహణలో ప్రతిభ కన బర్చిన వారిని సన్మానించారు. ఈ సందర్భంగా ఆర్ ఎం మాట్లాడుతూ గ్రాండ్ హెల్త్ ఛాలెంజ్ పేరుతో ఇటీవల ఉద్యోగులందరికీ వైద్యపరీక్షలు చేయించి నిపుణులైన వైద్యులతో సలహాలు ఇప్పిస్తున్నామని తెలిపారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న మహాలక్ష్మి పథకం విజయవంతం కావడం లో కండక్టర్లు, డ్రైవర్ల పాత్ర వెలకట్టలేనిదని చెప్పారు. ఈసందర్భంగా రీజియన్ పరిధిలోని ఏడు డిపోల్లో ప్రతిభ కనబరిచిన 36 మంది డ్రైవర్లు, 14 మంది కండక్టర్లు, ఆరుగురు మెకానిక్‌లను సన్మానిం చారు. అలాగే, ఉత్తమ బస్‌స్టేషన్లుగా ఎంపికైన మధిర, భద్రాచలం డీఎంలను సైతం సత్కరిం చారు. ఈకార్యక్రమంలో ఆర్టీసీ అధికారులు పవిత్ర, శ్రీహరి, బాలస్వామి తదితరులు పాల్గొన్నారు.

సీఎం కాన్వాయ్‌లో వాహనాలు తనిఖీ



ఖమ్మంలోని ఖమ్మం – వైరా ప్రధాన రోడ్డు పుట్టకోట క్రాస్ సమీపాన ఏర్పాటుచేసిన చెక్‌పోస్ట్ వద్ద సీఎం రేవంత్‌రెడ్డి కాన్వాయ్‌లోని వాహనాలను శనివారం తనిఖీ చేశారు. కొత్తగూడెంలో జరిగిన సభకు సీఎం హాజరుకాగా.. హెలిప్యాడ్ నుండి సభావేదిక వద్దకు, సభ నుంచి హెలీప్యాడ్ వద్దకు సీఎంను చేర్చేందుకు కాన్వాయ్ చేరుకుంది. ఇందులోని వాహనాలు సాయంత్రం తిరిగి వెళ్తుండగా పుట్టకోట చెక్‌పోస్ట్ వద్ద అధికారులు తనిఖీ చేశారు. – ఖమ్మంఅర్బన్